Licensed to post without Prepayment No. J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 09.11.2018, శుక్రవారం సంపుటి : 38 సంచిక : 23 పేజీలు : 12, వెల : ₹ 5




లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com

# నేస్తమా? భస్మాసుర హస్తమా?

"రికార్డులు సృష్టించాలన్నా మేమే... రికార్డులు బద్దలు కొట్టాలన్నా మేమే..." ఓ తెలుగు సినిమాలో బాలకృష్ణ డైలాగ్! సినిమాల మాటేమోగాని రాజకీయాలలో పొత్తుల రికార్డులు బద్దలు కొట్టాలన్నా, కొత్త రికార్డులు సృష్టించాలన్నా ఎవరైనా చంద్రబాబు కిందే!

- మోడీ దెబ్బకు చంద్రబాబులో వణుకు
- తనను కాపాడుకోవడానికే కాంగ్రెస్ చెంతకు
- ఇటలీ దెయ్యం.. ఇప్పుడు నారా ఇంటి దేవతైందా?
- కాంగ్రెస్‌తో పొత్తే టీడీపీని ముంచుతుందా?



జాతీయ రాజకీయాలలోనే ఏ పార్టీ అధినాయకుడికి కూడా చంద్రబాబు లాంటి రికార్డు ఉండదేమో?! బీజేపీ, సిపిఎం, సిపిఐ, టిఆర్‌ఎస్ మళ్ళీ బీజేపీ, జనసేన... ఇప్పుడు కాంగ్రెస్... రాష్ట్ర రాజకీయాలలో మనుగడలో వున్న అన్ని పార్టీలతో తెలుగు దేశం పొత్తు అయిపోయింది. ఇక మిగిలింది వైసిపి ఒక్కటే! అది కూడా చంద్రబాబు పార్టీకి ఎసరుపెట్టడానికి రెడీగా వుండేది ఆ పార్టీయే కాబట్టి పొత్తు కుదరడం లేదు. మిగతా అన్ని పార్టీలతో పొత్తు ఒకెత్తు. కాంగ్రెస్‌తో పొత్తు మరోఎత్తు. కాంగ్రెస్‌తో పొత్తు అన్నది ఒరిజనల్ తెలుగుదేశం కార్యకర్తలు, నాయకులు ఓ పట్టాన జీర్ణించుకోలేరు. కాకపోతే ఇప్పుడు తెలుగుదేశంలో డామినేషన్ కాంగ్రెస్ నుండి వలసొచ్చిన నాయకులు, కార్యకర్తలది కాబట్టి కాంగ్రెస్ పొత్తుపై పార్టీలో పెద్దగా నిరసన స్వరాలు వినిపించడం లేదు. ఒకరిద్దరు వినిపించాలని చూసారు కాని... చంద్రబాబు అప్పుడే తొక్కేసాడు!

## మోడీ భయంతోనేనా..?

టీడీపీ, కాంగ్రెస్‌ల పొత్తు అన్నది ఎవరూ వూహించరు. ఎన్టీఆర్ తెలుగు దేశం పార్టీని పెట్టిందే ఆనాటి కేంద్రంలోని కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా! కాంగ్రెస్ భావజాలానికి, టీడీపీ సిద్ధాంతాలు పూర్తి విరుద్ధం. ఇప్పుడంటే రాష్ట్రంలో వైసిపి ప్రత్యర్థిగా వుంది కాని, మొన్నటి వరకు కాంగ్రెస్సే ప్రధాన ప్రత్యర్థి కదా!

రాష్ట్రానికి బీజేపీ ద్రోహం చేసిందని చెప్పి చంద్రబాబు కాంగ్రెస్‌తో కలిసాడు. మరి కాంగ్రెస్ రాష్ట్రానికి చేసిందేమిటి? కాంగ్రెస్ ఏపికి చేసిన దానిని ద్రోహం కూడా అనరు... దారుణం, దుర్మార్గం అంటారు. ఈ రాష్ట్ర ప్రజలెప్పుడూ బీజేపీని ఆదరించలేదు. కాబట్టి వాళ్లను పట్టించుకోనవసరం లేదు. కాని, కాంగ్రెస్‌ను ఎన్నో సార్లు నెత్తిన పెట్టుకున్నారు. దానికి ప్రతిఫలంగా కాంగ్రెస్ ఏమి చేసిందో చూసాం. విభజన పేరుతో వట్టి గుడ్డలతో ఆంధ్రులను నడిరోడ్లో నిలబెట్టింది. ఇలాంటి కిరాతక కాంగ్రెస్‌ను ఆంధ్రులెవరూ క్షమించరు. అలాంటి దుర్మార్గపు పార్టీతో పొత్తు పెట్టుకున్న చంద్రబాబుకూ గుణపాఠం తప్పదు. కేవలం ప్రధాని నరేంద్ర మోడీ భయంతోనే చంద్రబాబు ఇంతగా దిగజారి కాంగ్రెస్‌తో పొత్తుకు సిద్ధమయ్యాడని తెలుస్తోంది. రాజకీయాలలో దిగజారిపోవడానికి ఎంత లోతు వుంటుందో చంద్రబాబు అంతకంటే ఎక్కువ లోతుకే వెళ్లిపోయాడు. ఇక ఇంతకంటే పోయేది ఏమీ వుండదు. సరే వ్రతం చెడ్డా ఫలితం దక్కుతుందా? కాంగ్రెస్‌తో పొత్తు చంద్రబాబుకు ఏ విధంగా ప్రయోజనం కలిగిస్తుంది. ముందు మోడీ భయం బాబును వెంటాడుతోంది. (మిగతా 11వ పేజీలో)

## నారాయణకి... సాహస పోరాటమే!



### » గెలుపు నల్లేరుపై నడకేం కాదు!

నెల్లూరు అసెంబ్లీ నుండి తెలుగుదేశం అభ్యర్థిగా నారాయణ పోటీ చేస్తున్నాడంట... 1999 ఎలక్షన్ నుండి ఈ మాట వింటున్నాం. 99 పోయింది, 2004 పోయింది, 2009 పోయింది, 2014 కూడా పోయింది. 2019 రాబోతోంది. అంటే ఆయన పోటీ చేస్తాడంట అన్న ప్రచారం మాత్రం (మిగతా 11వ పేజీలో)




## సమున్నత ఆశయం.. మహోన్నత ధ్యేయం

బాలికల విద్య కోసం ఆవిర్భవించిన ఆలయం

ఇదీ.. ① కస్తూరిదేవి కథ

శ్రీ కస్తూరిదేవి విద్యాలయం 3లో

## సైకిల్ ఎక్కనున్న రాఘవ



### చంద్రబాబును కలిసిన బొమ్మిరెడ్డి
### పార్టీలో భవిష్యత్ ఉంటుందని హామీ

రాజకీయం అంటే గమ్యం తెలియని ప్రయాణం. ఒకసారి ఆ మార్గంలోకి వచ్చాక ఎన్ని మలుపులుంటే అన్ని మలుపుల్లో పోతుండాల్సిందే! కొందరి ప్రయాణంలో ఈ మలుపులు రాకపోవచ్చు. ఇంకొందరి ప్రయాణంలో (మిగతా 11వ పేజీలో)



# పేరుకు పెద్ద అధికారి... పెడబుద్ధుల పాత్రధారి!

*ఒక వ్యక్తి ఆర్థికంగా ఎదగొచ్చు... రాజకీయంగా పెరగొచ్చు... హోదా పరంగా ఉన్నత స్థానంలో ఉండొచ్చు... అయితే వివిధ స్థాయిల్లో ఆయా వ్యక్తులు ప్రదర్శించే వ్యక్తిత్వం, వారి బుద్ధి కుశలతను బట్టే వారు వుంటున్న స్థానాలకు గౌరవం వస్తుంది. చదువు, సంధ్య లేనివాడు దొంగయితే సమాజం పెద్దగా పట్టించుకోదు. ఉన్నత చదువులు చదివినోడు దొంగయితే, జనాలను మోసం చేసే చీటర్ అయితేనే... సమాజం నీకేం పోయే కాలంరా... అంటుంది.*

అదిగో అలా సమాజం వేలెత్తి చూపిస్తోంది ఓ జిల్లా ఉన్నతాధికారి వైపు. ఆయన కూడా చదువు, సంధ్యా లేని వాడు కాదు. గ్రూప్ వన్ ఆఫీసర్. కాని డబ్బుల కోసం అడ్డదారులు తొక్కి నలుగురిని నమ్మించి నట్టేటముంచి అందరి చేత ఛీ కొట్టించుకుంటున్నాడు. ఆ అధికారి ఎవరో కాదు... నెల్లూరు జడ్పీ సిఇఓ సి. హెచ్. సుబ్రహ్మణ్యం.

ఇటీవలే ప్రభుత్వం మంజూరు చేసిన పంచాయితీ కార్యదర్శుల పోస్టులను నిరుద్యోగులకు ఎరగా వేసి ఒక్కొక్కరి నుండి 3 నుండి 5లక్షల వరకు గుంజాడు. నెల్లూరుజిల్లాలోనే కాకుండా కడప, ప్రకాశం, గుంటూరు, కృష్ణ జిల్లాల్లో కూడా నిరుద్యోగుల నుండి పంచాయితీ కార్యదర్శుల పోస్టులు ఇప్పిస్తానని ఆశ పెట్టి లక్షలకు లక్షలు వసూలు చేసాడు. ఈ పోస్టుల నియామకం నేరుగా పంచాయితీ రాజ్ కమిషనర్ భర్తీ చేస్తాడని, ఏపిపిఎస్సీ ప్రమేయం వుండదని నమ్మబలికాడు. ఇతనికి సెక్రటేరియట్‌లో పెద్ద పలుకుబడి వుందనుకున్న పలువురు అధికారులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు కూడా తమ బంధువులు, స్నేహితులకు పంచాయితీ కార్యదర్శుల పోస్టుల కోసం సుబ్రహ్మణ్యంను ఆశ్రయించారు. లక్షలకు లక్షలు ఆయనకు సమర్పించుకున్నారు. తీరా చూస్తే సుబ్రహ్మణ్యం చేసింది చీటింగ్ అని తేలిపోయింది. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లుగా బాధితులు ఇప్పుడు లబోదిబోమంటున్నారు. జిల్లా కలెక్టర్ మాత్రం సుబ్రహ్మణ్యం చేసిన తప్పుడు పనికి ప్రస్తుతానికి ఆయనను ప్రభుత్వానికి సరెండర్ చేశారు. మోసపోయిన బాధితులకు ఇక న్యాయం జరగాల్సివుంది.

## ఉపాధి డబ్బుల్ని.. గుటకాయస్వాహా చేసేశారు

**● ఇద్దరు మాయగాళ్ళ సస్పెండ్**

పనులు చేయకుండానే చేసేసినట్లు బిల్లులు రాసుకుని, ఆ మంజూరైన డబ్బును కాస్తా గుటకాయస్వాహా చేసేందుకు ఇద్దరు పన్నిన పన్నాగం బట్టబయలైంది. దీంతో ఉన్నతాధికారులు ఆ ఇద్దరు మాయగాళ్ళను సస్పెండ్ చేశారు. వరికుంటపాడు మండలంలోని నార్త్ కొండాయపాళెం జాతీయ ఉపాధి హామీ పథకంలో జరిగిన బాగోతం ఇది. ఇక్కడ 2016-17 సంవత్సరంలో మంజూరైన ఒక చెక్‌డ్యామ్‌ను నిర్మించకుండానే, దాని నిర్మాణం కోసం పంపిన 3,65,166 రూపాయల నిధిని ఈ పనులను పర్యవేక్షిస్తున్న టిఏ జి.హజరత్, ఇ.సి పి. రమేష్ ఇద్దరూ కలిసి బినామీ సప్లయిర్ మల్లికార్జున బ్యాంక్ ఖాతాలో వేశారు. ఇలా అక్రమంగా డబ్బు ఇతరుల ఖాతాలోకి జమ కావడాన్ని గమనించిన ఏపిఓ వినయ్ వెంటనే ఆ విషయాన్ని ఉదయగిరి ఏపిడికి తెలియజేయడం, డ్వామా పీడీ దృష్టికి తీసుకురావడంతో వారి నివేదికల మేరకు డ్వామా పీడీ ఆ ఇద్దరినీ విధుల నుంచి తొలగిస్తూ ఈనెల 3న ఉత్తర్వులు జారీ చేశారు.

## ఆరోగ్య ఉద్యోగుల నూతన కార్యవర్గం

నెల్లూరు జిల్లా వైద్యఆరోగ్య శాఖ కార్యాలయంలో ఈనెల 5న ఫెడరేషన్ ఆఫ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. డివిజన్ అధ్యక్షుడిగా ఎన్.వి. రమణయ్య, కో-ఛైర్మన్‌గా డాక్టర్ హరిశ్చంద్ర సతీష్ గౌడ్, వైస్ ఛైర్మన్‌గా ఏవీ రమణమ్మ, ధర్మేంద్ర, నారాయణరెడ్డి, షంషుద్దీన్, కన్వీనర్‌గా షేక్ ఉస్మాన్, కో కన్వీనర్‌గా ఆచారి, జాయింట్ కన్వీనర్‌గా జయలక్ష్మి, బి.అశోక్, ఉమా మహేశ్వరి, కోశాధికారిగా కే. నాయబ్ రసూల్ ఎన్నికయ్యారు. ఎన్‌జీవో సంఘం నేతలు వై. రమణారెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు.

## టీడీపీకి టైం దగ్గరపడింది!

**- సూళ్ళూరుపేట ఎమ్మెల్యే సంజీవయ్య**



ఆరిపోయే దీపానికి వెలుగు ఎక్కువంటారు. అధికార అహం కారణంతో తెలుగుదేశం వాళ్ళు మిడిసిపడుతున్నారు. తెలుగుదేశం పార్టీని ప్రజలు తన్ని తరిమేసే రోజులు దగ్గరపడ్డాయి కాబట్టే ఇంత దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని సూళ్ళూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పేర్కొన్నాడు. ఈనెల 6వతేదీ నాటికి వై.యస్. జగన్ ప్రజాసంకల్ప పాదయాత్ర ప్రారంభించి ఏడాదైన సందర్భంగా నాయుడుపేటలోని తన ఇంట్లో సంజీవయ్య విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడాడు. తెలుగుదేశం ప్రభుత్వం కేవలం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల కోసం మాత్రమే పని చేస్తుందని, పథకాలను వారికి మాత్రమే పరిమితం చేస్తోందని విమర్శించాడు. ప్రజా సంక్షేమం కోసం దివంగత నేత డాక్టర్ వై.యస్.రాజశేఖర రెడ్డి అమలుచేసిన ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా చంద్రబాబు ప్రభుత్వం సవ్యంగా కొనసాగించడం లేదన్నాడు. రాష్ట్ర వ్యాప్తంగా జగన్‌కు వస్తున్న అపూర్వ ప్రజాదరణను చూసి సహించలేకే జగన్‌పై హత్యాయత్నం చేసే స్థాయికి ప్రత్యర్థులు దిగజారిపోయారని ఆయన విమర్శించాడు. రాష్ట్రానికి ప్రత్యేకహోదా కావాలన్నా, రాష్ట్రంలో తిరిగి రాజన్న రాజ్యం రావాలన్నా అది జగన్మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఆయన పేర్కొన్నాడు.

## అవయవాల మార్పిడిలో 'నారాయణ' మరో ముందడుగు!

ఇంతవరకు బ్రెయిన్‌డెడ్‌కు గురైన రోగుల నుండి అవయవాలను సేకరించడంలో విశేష కృషి చేస్తున్న నారాయణ వైద్య సంస్థలు ఇప్పుడు ఇంకో మెట్టు ఎక్కాయి. ఇంతకుముందు గుండె, ఊపిరితిత్తులు అవయవాలను సేకరించినా వాటిని పేషంట్లకు మార్పిడి చేయడం కోసం చెన్నైకో, లేదా హైదరాబాద్‌కో తరలించాల్సి వచ్చేది. ఇది ఎంతో రిస్క్‌తో కూడుకున్న పని. అలాకాకుండా ఇప్పుడు నారాయణ ఆసుపత్రిలోనే పేషంటుకు గుండె, ఊపిరితిత్తుల మార్పిడి ప్రక్రియను నిర్వహించేలా చెన్నైకు చెందిన గ్లేనిగెల్స్ గ్లోబల్ సిటీ ఆసుపత్రితో ఒప్పందం కుదుర్చుకుంది. గ్లేనిగెల్స్ గ్లోబల్ సిటీ ఆసుపత్రి వైద్యబృందం నారాయణ ఆసుపత్రిలోని వైద్య సదుపాయాలను పరిశీలించాకే ఈ ఒప్పందం కుదుర్చుకున్నారు.

## బిజెవైఎం బాధ్యతలు ఉదయ్‌కు అప్పజెప్పారు

భారతీయ జనతా యువమోర్చా జిల్లా అధ్యక్షుడిగా పాలిచర్ల ఉదయ్‌కుమార్‌ను నియమించినట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు పి.సురేంద్రరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయ్‌ది కొడవలూరు మండలంలోని యల్లాయపాలెం. విద్యార్థి దశ నుండి ఏబివిపిలో చురుకుగా వుంటూ పలు బాధ్యతలు నిర్వర్తించాడు.

## రంగనాథుడి ఆదాయం

నెల్లూరు, శ్రీ తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానం హుండీని 5వతేదీ లెక్కపెట్టారు. 3నెలల 6రోజుల కాలానికి గాను 8,81,362 రూపాయలు ఆదాయం సమకూరింది. దేవాదాయశాఖ అధికారులు, మాజీ పాలకమండలి ఆధ్వర్యంలో హుండీ లెక్కింపులు జరిగాయి.

## 16న గురునిలయంలో 'దుప్పట్ల పండుగ'

నెల్లూరు మూలాపేటలోని గురునిలయంలో ఈ నెల 16న 'దుప్పట్ల పండుగ' జరుగనుంది. వందలాదిమంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తూ, ఆ రోజున నిరుపేదలకు ఇక్కడ పెద్దఎత్తున అన్నదానం నిర్వహిస్తారు. 'ఆకలై కొంగుపట్టేవారికి అన్నం పెట్టాలయ్యా..ఆపదల్లో ఉన్నవారిని ఆదుకోవాలయ్యా'..అని బోధించిన భగవాన్ శ్రీ వెంకయ్యస్వామివారి సూక్తులను భక్తిశ్రద్ధలతో ఆచరిస్తూ శ్రీ వెంకయ్యస్వామివారి శిష్యునిగా ప్రసిద్ధి చెంది ఇటీవలే స్వర్గస్తులైన శ్రీ మాకాని వెంకట్రావుస్వామివారి 'గురునిలయం'లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నామని మాకాని వెంకట్రావుస్వామి కుమారుడు గోపిచంద్ చెప్పాడు. 'మా తండ్రిగారు భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి పాదరేణువుగా ఉంటూ.. సుమారు పదిహేనేళ్ళుగా నిరుపేదల కోసం నిర్వహిస్తున్న ఈ దుప్పట్ల పండుగను ఆయన స్వర్గస్తులయ్యాక... ఈఏడాది నుంచి తాము కొనసాగిస్తున్నామని, నగరంలోని అనేకమంది పేదలు ఈ పండుగలో పాల్గొంటారని, వారందరికీ ఆరోజున గౌరవంగా దుప్పట్లు ఇచ్చి, మంచి భోజనం పెడతామని ఆయన చెప్పాడు. నిరుపేదలు, వృద్ధులు, అనాథలు ఈ చలికాలంలో కనీసం కప్పుకునేందుకు దుప్పట్లు కూడా లేక బాధపడుతుంటారని, అలాంటి అసహాయులకు సేవ చేయాలనే తలంపుతోనే తాము ఈ కార్యక్రమం కొనసాగిస్తున్నామని ఆయన తెలిపాడు. ఈ కార్యక్రమంలో భాగంగా నగరంలో ఉన్న 10 అనాధాశ్రమాలవారికి అవసరమైన దుప్పట్లను, భోజనాన్ని ముందుగానే ఆయా ఆశ్రమాలకు పంపిస్తున్నామన్నారు.

## కేంద్ర రైల్వే బోర్డు డైరెక్టర్‌గా విజయలక్ష్మి

నెల్లూరు జిల్లా సంగం గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ మహిళా నాయకురాలు కాకు విజయలక్ష్మి కల ఫలించింది. కేంద్ర రైల్వే బోర్డులో(పీఏసీ) డైరెక్టర్‌గా ఆమె కేంద్ర రైల్వే మంత్రిత్వశాఖ నుండి ఈనెల 6 న ఉత్తర్వులు అందుకుంది. దేశవ్యాప్తంగా 15 మందిని ఎంపిక చేయగా ఆంధ్రప్రదేశ్ నుంచి కాకు విజయలక్ష్మికి స్థానం లభించడం సింహపురికే గర్వకారణం. త్వరలో ఆమె ఢిల్లీలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. గత 35 ఏళ్ళుగా బీజేపీలో పలు పదవులను అలంకరించి ఆ పదవులకే వన్నె తెచ్చింది. ప్రస్తుతం బీజేపీ రాష్ట్ర కార్యదర్శిగా పని చేస్తున్నారామె. పార్టీకి ఆమె చేసిన సేవలను గుర్తించిన జాతీయ, రాష్ట్ర బీజేపీ నాయకులు ఆమెను కేంద్ర రైల్వే బోర్డు డైరెక్టర్‌గా సిఫార్స్ చేశారు. పార్టీలతో నిమిత్తం లేకుండా అందరూ ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

## జాతీయస్థాయి అథ్లెటిక్స్‌లో అదరగొట్టిన సుప్రియ

రాంచీలో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో అండర్ 20 విభాగంలో 200 మీటర్ల పరుగు పందెంను 24.30 సెకన్లలో, 100 మీటర్ల పరుగును 12.07 సెకన్లలో పూర్తి చేసి బంగారు, రజిత పతకాలను సాధించింది సుప్రియ. డికెడబ్ల్యు డిగ్రీ కళాశాలలో చదువుతున్న కే.సుప్రియను ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మస్తానయ్య కళాశాల ఫిజికల్ డైరెక్టర్ రవీంద్రమ్మ, అధ్యాపకులు ఈనెల 6న అభినందించారు.

## రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు వైద్య పరీక్షలు

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించాలని, 40 ఏళ్ళు నిండిన వారు ప్రతి ఏటా వైద్య పరీక్షలు చేయించుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్య మాస్టర్ హెల్త్ చెకప్ పేరుతో జీవో 492ను విడుదల చేశారు. ఈ నెల నుంచి ఈ పథకం రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ వైద్యశాలల్లో అమలు కానుంది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల దంపతులకు రెండు దశల్లో, రాయితీపై వైద్య పరీక్షలు చేస్తారు. మహిళలకు 24 రకాలు, పురుషులకు 26 రకాలు వైద్య పరీక్షలు చేస్తారు. ఈహెచ్‌ఎస్‌లో నమోదైన అన్ని రకాల వైద్యశాలల్లో ఆరోగ్యమిత్రలను సంప్రదించి హెల్త్ కార్డు చూపించి ఏ రోజు పరీక్షకు రావాలో తేదీలను నిర్ణయించుకోవలసి ఉంటుంది.

## బాడీబిల్డింగ్.. అదుర్స్!

కావలిలో ఈ నెల 4న మిస్టర్ ధర్మపురి ఐరన్‌మ్యాన్ ఏపీ స్టేట్ బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్ పోటీలు ఎంతో ఉత్సాహంగా జరిగాయి. రాష్ట్రస్థాయిలో జరిగిన ఈ పోటీల్లో ఎంతోమంది యువకులు వంపులు తిరిగిన కండలతో తమ శరీరసౌష్టవాన్ని ప్రదర్శించి అందరినీ ఆశ్చర్యచకితుల్ని చేశారు. కావలి బృందావన కాలనీ కల్యాణ మండపంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా వందమంది దాకా బాడీబిల్డర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా బాడీబిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ బెజవాడ రవికుమార్ మాట్లాడుతూ ప్రజలంతా మంచి శరీరసౌష్టవంతో ఆరోగ్యవంతులుగా జీవించాలని తాము ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. తొలుత కావలి నివాసి ధర్మపురి శేషయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు, మాల్యాద్రినాయుడు, ఆలేఖ్య, రెడ్‌క్రాస్ జిల్లా కమిటీ సభ్యుడు గంధం ప్రసన్నాంజనేయులు, దామిశెట్టి సుధీర్‌నాయుడు, తిరువీధి ప్రసాద్, ఏవి రమణమూర్తి, డాక్టర్ మాధవరెడ్డి, జగన్, ఈశ్వర్, డాక్టర్ వంశీ తదితరులు పాల్గొన్నారు.

## ఏఆర్ డిఎస్పీగా రవీంద్రరెడ్డి

నెల్లూరు ఏఆర్ డిఎస్పీగా రవీంద్రరెడ్డిని నియమించారు. ఇక్కడ డిఎస్పీగా వున్న చంద్రశేఖర్‌ను విజయవాడకు ఏఆర్ ఏసిపిగా బదిలీ చేశారు. డీజీపీ ఆఫీసులో వెయిటింగ్‌లో వున్న రవీంద్రరెడ్డిని నెల్లూరుకు పంపారు. ఈయన గతంలో టిటిడి విజిలెన్స్ విభాగంలోనూ పనిచేశారు.

# సమున్నత ఆశయం.. మహోన్నత ధ్యేయం




## బాలికల విద్య కోసం ఆవిర్భవించిన ఆలయం శ్రీ కస్తూరిదేవి విద్యాలయం

ఇది ఓ మహా విద్యాలయం.. చారిత్రాత్మక సరస్వతీ నిలయం. వందేళ్ళ చరిత్ర కలిగిన విద్యా కుసుమం. ఇప్పుడా సంస్థను నాశనం చేయాలనే ప్రయత్నం జరుగుతోంది. పవిత్రమైన ఈ సంస్థపై కొందరు చరిత్రహీనుల కన్నుపడింది. ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని ఇన్నాళ్ళకు అభివృద్ధి ఫలాలను అందుకోబోతున్న తరుణంలో కొన్ని స్వార్థపూరిత శక్తులు, విషపురుగులు ఈ సంస్థను, సంస్థ సారధులను భ్రష్టు పట్టించే ప్రయత్నం చేస్తున్నాయి. ఇది క్షమించరాని విషయం... చారిత్రాత్మక తప్పిదం!

ఒక సమున్నత ఆశయంతో, మహోన్నత ధ్యేయంతో ఆనాటి స్వాతంత్ర్య సమరయోధురాలు శ్రీమతి పొణకా కనకమ్మ స్ఫూర్తితో బాలికల విద్యే ధ్యేయంగా 1923వ సంవత్సరంలో 'శ్రీమతి కస్తూరిబా పాఠశాల' పేరుతో శ్రీ కస్తూరిదేవి విద్యాలయం సంస్థ పురుడుపోసుకుంది. నెల్లూరులో ఉన్న అనేకమంది ప్రముఖులు, దాతల అండదండలతో.. మహనీయురాలు పొణకా కనకమ్మ ఈ మహత్కార్యానికి శ్రీకారం చుట్టింది. జాతీయ భావాలతో, ఉన్నతాదర్శాలతో ఈ పాఠశాలను స్థాపించడం జరిగింది.

### 1927లో తొలి కమిటి

ఈ సంస్థ నిర్వహణా బాధ్యతలు, సంస్థ అభివృద్ధి కోసం అవసరమైన నిర్ణయాలు తదితర అంశాలను దృష్టిలో ఉంచుకుని 1927వ సంవత్సరంలో ఈ సంస్థకు ఒక కమిటీ ఏర్పడింది. 11-3-1927న జరిగిన నిర్వాహక సభా తీర్మానంలో ఈ విద్యాలయాన్ని రిజిస్టరు చేయించాలని, కార్య నిర్వాహక సంఘానికి శ్రీయుత కెవి రాఘవాచార్యుల వారు అధ్యక్షులుగను, శ్రీమతి పొణకా కనకమ్మగారు కార్యదర్శిగా ఉండునట్లు, శ్రీయుత తిక్కవరపు వెంకట రామారెడ్డి గారు కోశాధిపతిగ ఉండునట్లు తీర్మానించారు. ఈ విద్యాలయానికి శాశ్వత నివేశనమునకుగాను తగిన ప్రయత్నములు త్వరలో చేయాలని, మరియు గాంధీ మహాత్ముడు ఈ మండలమునకు వేంచేయునప్పటికి వారిచే ఈ విద్యాలయమునకు పునాదులు వేయించుటకై ముందు జరగవలసిన ఏర్పాట్లన్నియు చేసి సిద్ధపరచి ఉంచాలని తీర్మానించుకున్నారు. ఆ మేరకు 12-3-1927న 'శ్రీ కస్తూరిదేవి విద్యాలయం' సంస్థను రిజిస్టరు చేశారు.

### ప్రముఖుల ప్రశంసలు...

"నెల్లూరులోని శ్రీ కస్తూరిదేవి జాతీయ బాలికా పాఠశాలలో గరపునట్టి విద్య జాత్యభివృద్ధికి మిక్కిలి అనుకూలించునట్టిదిగ ఉన్నదని దేశనాయకులు శ్రీమాన్ ఎస్.శ్రీనివాసయ్యంగార్, దేశోద్ధారకులు శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావు పంతులుగారు మొదలగు ప్రముఖులు అభిప్రాయమిచ్చి

**1981లో కస్తూరిదేవి విద్యాలయ సంస్థలోని మూడెకరాల భూమిని ఆనాటి కమిటీసభ్యులు, వారితో పాటు మిగిలిన సభ్యుల అండతో కొందరు బడా పారిశ్రామికవేత్తలు లీజు పేరుతో కాజేసే గలీజు పనికి శ్రీకారం చుట్టినప్పుడు, ఆ సంస్థను, ఆ సంస్థ ఆస్తులను కాపాడడానికి ఆవిర్భవించిన నెల్లూరీయుల ప్రియపుత్రిక.. 'లాయర్' వారపత్రిక.**

**అప్పటి నుండి ఇప్పటివరకు సంస్థను, సంస్థ ఆస్తులను పరుల పాలు కానివ్వకుండా, కంటికి రెప్పలా కాపాడుకుంటూ సంస్థ అభివృద్ధి కోసం నిరంతరం తపనపడుతుండిన జెవిరెడ్డిగారికి అండగా ఉంటూ, పలు పర్యాయాలు సంస్థ బాగోగుల కోసం మీరంతా ముందుకు రండి.. అని ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అనేకమంది నెల్లూరు ప్రముఖులను అభ్యర్థిస్తూ 'లాయర్' వారపత్రిక వ్యవస్థాపకులు, కీర్తిశేషులు తుంగా రాజగోపాలరెడ్డి గారి ఆశయసాధనే లక్ష్యంగా శ్రమిస్తున్న పత్రిక.. 'లాయర్'.**

**నాటి నుంచి నేటి వరకు, రేపటి నుండి సంస్థను అభివృద్ధి పథంలో పెట్టేవరకు అదే పంథాతో, అదే ఉద్యమ స్ఫూర్తితో ముందుకు సాగుతోంది.. మా (మీ) లాయర్.**

**కస్తూరిదేవి విద్యాలయ సంస్థల గురించి ఎవరికీ తెలియని వాస్తవాలను, సంస్థ కోసం పాటుబడ్డ ప్రముఖుల వివరాలను 'ఇదీ కస్తూరిదేవి కథ' అనే శీర్షికతో ఈ వారం నుండి పాఠకుల ముంగిళ్ళలో ఆవిష్కరించబోతోంది.. మా (మీ) లాయర్.**

**కస్తూరిదేవి విద్యాలయం... ఏ ఒక్కరి సొత్తూ కాదు. ఆ సంస్థ పురోగతిని అడ్డుకోవడం ఏ ఒక్కరి తరమూ కాదు. ఈ సంస్థ అభివృద్ధే ధ్యేయంగా అక్షర సత్యాలతో పునరంకితమవుతూ... వాస్తవాల వీచికలను మా పాఠకులకు అందిస్తున్నాం.**

ఉండుట చేత, ఈ విద్యాలయము దొరతనము వారివల్ల గ్రాంటు తీసుకొనక ప్రజల సహాయము మీదనే ఆధారపడియుండుట చేతను, ఈ పాఠశాలకు మన జిల్లాలోని కో-ఆపరేటివ్ సొసైటీలు తమ కామన్‌గుడ్ ఫండ్‌లో నుండి గాని, మరియే ఇతర విధమున గానీ ధన సహాయము చేయుదురు గాక".. అని పాఠశాల పాలక వర్గం 24-4-1927లో కోరుతూ ఒక సర్క్యులర్ ద్వారా తీర్మానించింది.

అప్పట్లో నార్త్‌మోపూరు ఆర్‌ఎల్‌రెడ్డి గారి ధర్మముల నుంచి పాఠశాల సాయం కోరేందుకు కూడా తీర్మానం జరిగింది. ఈ సమావేశంలో శ్రీయుతులు ఓరుగంటి వెంకటసుబ్బయ్య, రాళ్ళపల్లి రామ సుబ్బయ్య, తిక్కవరపు వెంకటరామిరెడ్డి, పొణకా కనకమ్మ, కెవి రాఘవాచార్యులు, పి.రామచంద్రారెడ్డి, బెజవాడ సుందర రామిరెడ్డిలు పాల్గొన్నారు.

### బాలికల విద్యాభివృద్ధే లక్ష్యంగా...

విద్యాలయం అభివృద్ధి కోసం నిర్వాహకులు ఎంతగానో తాపత్రయ పడేవారు. చివరికి చందాలు దండైనా సరే బాలికల విద్యాభ్యున్నతికి పాటుపడాలని నిర్ణయించుకున్నారు. 1927 ఆగస్టు 7వ తేదిన జరిగిన కమిటీ సమావేశంలో ఈ విద్యాలయానికి ఒక రూపాయి చందా ఫండ్‌ను ఏర్పరచి, అట్లు చందా ఇచ్చిన వారిని సభ్యులుగా పరిగణించాలని తీర్మానించుకున్నారు.

అంతేకాదు, ఈ విద్యాలయానికి చందాలు వేయించి వసూలు చేసేవారికి వారు వసూలు చేయు మొత్తంలో పాతిక భాగం వారి ప్రయాణఖర్చులకు, భోజన ఖర్చులకు, వారికి ప్రతిఫలంగా ఇచ్చేవారు. చందాలు వసూలుచేసేవారు విద్యాలయానికి పంపేందుకు అయ్యే మనీఆర్డర్ ఖర్చులు కూడా విద్యాలయం వారే భరాయించేవారు. అంత న్యాయబద్ధంగా ఈ సంస్థ నిర్వహణను చేపట్టేవారు. ఆ వచ్చే పైకాన్నంతా కూడా దొడ్ల రామిరెడ్డి గారి బ్యాంక్‌లో కోశాధిపతి అయిన శ్రీయుత తిక్కవరపు వెంకటరామిరెడ్డిగారి పేరుతోనే యధాప్రకారం ఉంచేవారు. ఆ మేరకు 9.10.1927లో తీర్మానం కూడా జరిగింది.

నాటక ప్రదర్శనల ద్వారా వచ్చే మొత్తాన్ని కూడా కొందరు ఈ విద్యాలయం అభివృద్ధికి ఇచ్చేవారు. 8-10-1927లో తెనాలి నాట్యసభ వారు 'ప్రతాప రుద్రీయము' నాటకాన్ని ప్రదర్శించి వచ్చిన మొత్తాన్నంతా ఈ విద్యాలయం అభివృద్ధికి ఇచ్చిన సంఘటనలు కూడా ఉన్నాయి. ఇలాంటివన్నీ నాటి మహానుభావుల సమాజసేవాభావానికి, సమాజాభ్యుదయానికి వారు చేసిన సేవానిరతికి నిదర్శనాలుగా చెప్పుకోవచ్చు.

### శాశ్వత భవన నిర్మాణానికి సంకల్పం...

కస్తూరిదేవి విద్యాలయానికి శాశ్వత భవనాన్ని త్వరలోనే నిర్మించాలన్న గట్టి సంకల్పంతో 1927 మార్చి 11న జరిగిన సమావేశంలో ఆ సంకల్పం నెరవేరేందుకు కనీసం 20వేల రూపాయలు కావాల్సి ఉంటుందని, నాలుగు నెలల్లోగా ఆ ధనాన్ని వసూలు చేయాలని సంకల్పించారు. 1928 జూలై 18న జరిగిన సమావేశంలో.. కస్తూరిదేవి విద్యాలయానికి శాశ్వత నివేశనము అత్యంతావశ్యకమగుట చేత నెల్లూరు హైరోడ్డులో కందప్ప మేస్త్రీ సత్రమునకు సంబంధించిన 'బండ్లదొడ్డి'గా పిలువబడు స్థలము సుమారు 2 ఎకరములు, ఆ సత్రం ట్రస్టీల వల్ల ఒక సంవత్సరానికి 545 రూపాయలకు మించని నేలబాడుగ వారికి చెల్లించు షరతుతో ఈ విద్యాలయ కమిటీవారు శాశ్వత కౌలుకు తీసుకొనునట్లు తీర్మానించుకున్నారు. ఇలా వారు విద్యాలయం అభివృద్ధికి ఎంతగానో తంటాలుపడ్డారు.

### ప్రధానాచార్యులుగా ఓరుగంటి వారు...

అదేవిధంగా, బ్రహ్మశ్రీ ఓరుగంటి వెంకటసుబ్బయ్య పంతులుగారు ఈ విద్యాలయమునకు ప్రధానాచార్యులుగా ఉండి, విద్యాలయాన్ని అభివృద్ధికి తెచ్చేందుకు పాటుపడాల్సిందిగా కోరుతూ తీర్మానించారు. వారు ఇక్కడ ఉండి పని చేసినందుకు 50 రూపాయలకు మించని మొత్తాన్ని స్వీకరింపవలసిందిగా కోరారు.

కొద్దికాలానికి 'శ్రీ కస్తూరిదేవి విద్యాలయము' పేరుతో లెటర్‌హెడ్స్ వేయించారు. అందులో, స్థాపితము : 1923, రిజిస్టరు చేయబడినది : 1927 అని ముద్రించడమే కాక, రాట్నం బొమ్మను ముద్రించి...ఇందు బాలికలకు ఉచితముగ తెనుగు, సంస్కృతము, హిందీ, సంగీతము, కుట్టుపని, పేము పని నేర్పబడును..అని ముద్రించారు. దీనినిబట్టి ఆ కాలంలో బాలికలకు విద్యే కాక, వారి బతుకు తెరువుకు ఉపయోగపడే కుట్టుపని, పేము పని కూడా నేర్పడం వారిలో ఉండే బాలికాభ్యున్నతి ఆకాంక్షకు ప్రతీక.

అప్పట్లో ఈ విద్యాలయానికి అధ్యక్షునిగా కె.వి.రాఘవాచార్యులు బిఏబిఎల్, కార్యదర్శులు పొణకా పట్టాభిరామరెడ్డి, పొణకా కనకమ్మ, కోశాధికారి తిక్కవరపు వెంకట్రామిరెడ్డి, కమిటీ సభ్యులు బెజవాడ సుందరరామిరెడ్డి, పర్వతరెడ్డి రామచంద్రారెడ్డి, ఓరుగంటి వెంకటసుబ్బయ్య, రాళ్ళపల్లి రామసుబ్బయ్యల పేర్లతో లెటర్‌హెడ్ ముద్రితమైంది.

ఆతర్వాత కొద్దిరోజులు కార్యదర్శి శ్రీమతి పొణకా కనకమ్మగారు అనారోగ్యం పాలయ్యారు. దీంతో ఆమె ఒక నెల రోజుల పాటు సెలవు కోరినందువల్ల ఆమె స్థానంలో ఆ నెల రోజులు కార్యదర్శిగా సమావేశాలు నిర్వహించేందుకు ఓరుగంటి వెంకటసుబ్బయ్య గారిని నియమించుకున్నారు.

1928 జూన్ 22న అల్లూరు శ్రీకృష్ణ విలాస సభవారు ఈ విద్యాలయం సహాయార్థం జూలై 3న చిత్రనళీయము నాటకమును ప్రదర్శించుటకు ఏర్పాట్లు చేశారు. అటు దాతల సహకారంతోను, నాటక ప్రదర్శనల వారిచ్చే సాయంతోను విద్యాలయ నిర్వహణ జరిగేది.

ఏదేమైనా సరే బాలికలకు విద్య చెప్పించి తద్వారా వారి కుటుంబాలకు, సమాజానికి వెలుగుబాటలు పరవాలనే సదాశయంతో వారంతా నిరంతరం తపించేవారు. **(మిగతా కథ వచ్చే వారం)**




ఇటీవల నెల్లూరు టౌన్‌హాలులో జరిగిన కళాంజలి 25వ వార్షికోత్సవ వేడుకల్లో వివిధ రంగాల్లో సేవలందించినందుకుగాను ఎన్‌బికెఆర్ ఐఎస్‌టి చైర్మెన్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా సేవా అవార్డులు అందుకుంటున్న యనమండ్ర నాగదేవిప్రసాద్, కొండా వెంకటస్వామి, సామంతు గోపాలరెడ్డి, జయఫిలిప్స్, నారు ప్రభావతి, సుశీలమ్మలు

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# 'ప్రభా'తం

## చరిత్రను తిరగరాస్తున్నారు?

ఇప్పుడు అందరి దృష్టి, అందరి మాటలు పటేల్ విగ్రహం చుట్టూనే వుంటున్నాయి. దాని ఖర్చుపైనే వాదనలు వినిపిస్తున్నాయి. కాని పటేల్ భారీ విగ్రహం అన్నది మారబోతున్న భారత చరిత్రకు ఒక శాంపిల్ మాత్రమే. సరికొత్త చరిత్రకు మోడీ శ్రీకారం చుట్ట బోతున్నారు. గత ఏడు దశాబ్దాలుగా కాంగ్రెస్‌వాళ్ళు ముసుగేసి దాచిపెట్టిన వాస్తవ చరిత్రను ప్రజల ముందు ఆవిష్కరించబోతున్నారు. ఇప్పటికే ఈ ప్రక్రియకు ఆరంభం జరిగినట్లుగా తెలుస్తోంది.



రాము, సోము ఇద్దరు స్నేహితులు అడవిగుండా వెళుతున్నారు. మధ్యలో పెద్దపులి గాండ్రిస్తూ ఎదురొచ్చింది. సోము భయస్తుడు. పులిని చూడగానే దగ్గరలో వున్న చెట్టు ఎక్కేసాడు. రాము మాత్రం పులిని ఎదుర్కొన్నాడు. పులి పంజాతో రామును కొట్టింది. రాము చేతికి తగిలిన కొయ్యముక్కతో పులిని ఇష్టమొచ్చినట్లు పొడిచాడు. ఈ పోరాటంలో చివరకు రాము, పులి ఇద్దరూ చనిపోయారు. అప్పుడు సోము చెట్టు దిగి వచ్చాడు. తన చొక్కాకు రక్తం పూసుకున్నాడు. చనిపోయిన పులిని ఈడ్చుకుంటూ తన గ్రామంలోకి వెళ్లాడు. అడవికి మేతకు వెళ్లిన మన పశువులను చంపి తింటున్న పులిని ప్రాణాలకు తెగించి పోరాడి చంపానని గ్రామస్థులతో చెబుతాడు. అది నమ్మిన ఊరి జనం సోముకు మంగళహారతులు పట్టి జేజేలు పలుకుతారు. ఆయనకు గ్రామసింహం, బెదరని బెబ్బులి వంటి బిరుదులు కూడా ఇస్తారు.

ఈ కథకు భారత స్వాతంత్ర్య పోరాట సంగ్రామానికి ఎక్కడైనా సంబంధముందా? ఉందనే అనుమానాలు ఎప్పటి నుండో వున్నాయి. కాని ఇంతకాలం ఆ సందేహాలను నివృత్తి చేసే వాళ్ళు లేరు. ఇప్పుడా బాధ్యతను కేంద్రంలోని నరేంద్ర మోడీ సర్కార్ తీసుకున్నట్లుగా కనిపిస్తోంది.

గుజరాత్‌లోని సర్దార్ సరోవర్ డ్యామ్ వద్ద మూడువేల కోట్ల ఖర్చుతో 182 మీటర్ల ఎత్తుతో ప్రపంచంలోనే ఎత్తైన విగ్రహంగా ఉక్కుమనిషి సర్దార్ వల్లభ్‌బాయ్ పటేల్ విగ్రహాన్ని కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం మరియు గుజరాత్‌లోని బీజేపీ ప్రభుత్వం కలిసి నెలకొల్పాయి. ఈ మధ్యనే ప్రధాని నరేంద్ర మోడీ ఈ విగ్రహాన్ని ఆవిష్కరించారు కూడా! ప్రపంచంలో ఎత్తైన విగ్రహాన్ని ఏర్పాటు చేయడంపై దేశ వ్యాప్తంగా భిన్న వాదనలు వినిపించాయి. ఎన్డీయేతర పక్షాలన్నీ కూడా 3వేల కోట్లు ఖర్చుపెట్టి విగ్రహం పెట్టాల్సిన అవసరం వుందా... అంటూ పెదవి విరిచాయి. 3వేల కోట్లతో పేదలకు ఇళ్ళు కట్టి వుండొచ్చు. పటేల్ పేరుతో విద్యాలయం స్థాపించి ఉండొచ్చు. ఆసుపత్రి కట్టి వుండొచ్చు అంటూ తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. పటేల్ విగ్రహాన్ని ఆమోదించే బీజేపీ అనుకూల వర్గాలు మాత్రం... అమెరికాలో 'లిబర్టీ ఆఫ్ స్టాచ్యూ', బ్రెజిల్‌లో 'లార్డ్ క్రైస్ట్', చైనాలో 'బుద్ధ' విగ్రహాలను చూసి మాత్రం సూపర్ అంటారు, అదే మన దేశంలో వాటికన్నా ఎత్తైన విగ్రహం పెడితే దండగ ఖర్చు అంటారు. ఈ దేశంలో మావో, లెనిన్ విగ్రహాలెందుకు, పనికి మాలిన నేతలకు చాలామందికి విగ్రహాలుంటున్నాయి... అదంతా దండగ ఖర్చు కాదా... 500కుపైగా సంస్థానాలను ఇండియన్ యూనియన్‌లో విలీనం చేసి, ఇన్ని కులాలు, ఇన్ని భాషలు, ఇన్ని ప్రాంతాలుగా వున్న చిన్నచిన్న సంస్థానాలను కలిపి ఒక్క దేశంగా, ఒక్క జాతిగా మలచిన పటేల్‌ను ఈ మాత్రం గౌరవించుకోవడంలో తప్పులేదంటున్నారు.

అయితే అందరి దృష్టి, అందరి మాటలు పటేల్ విగ్రహం చుట్టూనే వుంటున్నాయి. దాని ఖర్చుపైనే వాదనలు వినిపిస్తున్నాయి. కాని పటేల్ భారీ విగ్రహం అన్నది మారబోతున్న భారత చరిత్రకు ఒక శాంపిల్ మాత్రమే. సరికొత్త చరిత్రకు మోడీ శ్రీకారం చుట్టబోతున్నారు. గత ఏడు దశాబ్దాలుగా కాంగ్రెస్‌వాళ్ళు ముసుగేసి దాచిపెట్టిన వాస్తవ చరిత్రను ప్రజల ముందు ఆవిష్కరించబోతున్నారు. ఇప్పటికే ఈ ప్రక్రియకు ఆరంభం జరిగినట్లుగా తెలుస్తోంది.

భారత దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించాక, ఆ పోరాట ఫలితం అంతా కూడా ఇద్దరు నాయకులకు, ఒక కుటుంబానికే అంకితమైపోయింది. బ్రిటీష్ వారితో హింసాత్మక పోరాటానికి దిగకుండా శాంతియుత మార్గంలో పోరాడిన మహాత్మాగాంధీ జాతిపితగా కీర్తి గడించారు. ఈ దేశం నుండి తెల్లదొరలను తరిమికొట్టింది ఆయనే అనేంతగా చరిత్రను రూపొందించారు. స్వాతంత్ర్యానంతరం భారతదేశం రెండు ముక్కలుగా విడిపోగా మహ్మదాలీ జిన్నాకు పాకిస్థాన్‌ను అప్పగించి, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూకు భారత్‌ను అప్పగించారు. ప్రజాస్వామ్య విధానంలో కాంగ్రెస్ అధ్యక్షుడుగా నేతాజీ సుభాష్‌చంద్రబోస్ అత్యధిక మెజార్టీతో ఎన్నికైనప్పటికీ గాంధీజీ మూలంగా ఆయన ఆ పదవి నుండి తప్పుకుని నెహ్రూకు ఇచ్చాడు. అలాగే భారత దేశానికి తొలి ప్రధాని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ కావాల్సినప్పటికీ, మెజార్టీ సభ్యులు ఆయనకే మద్దతు తెలిపినప్పటికీ మళ్ళీ నెహ్రూ పట్ల వున్న ప్రేమతో గాంధీజీ పటేల్‌కు మోకాలడ్డాడు. నెహ్రూను ప్రధానిని చేసి పటేల్‌ను ఉపప్రధానిని చేసారు. స్వాతంత్ర్యం వచ్చిందన్న మాటేగాని చీలికలు పేలికలుగా వున్న ఉపఖండాన్ని ఏకం చేసే బాధ్యతను పటేల్ తన భుజస్కంధాలపై మోసాడు. 500కు పైగా సంస్థానాలను నయానో, భయానో భారత్‌లో విలీనం చేశాడు. ఒక్క జమ్మూ, కాశ్మీర్‌ను విలీనం చేసే బాధ్యతను మాత్రం నెహ్రూ తీసుకున్నాడు. అప్పుడు ఆయన ఏ దృష్టితో ఆ బాధ్యత తీసుకున్నా డనే దానిపై అనేక వాదనలున్నాయి. తీసుకున్న ఒక్క బాధ్యతను కంపుచేసి పెట్టాడు. జమ్మూ, కాశ్మీర్‌ను తన స్వప్రయోజనాల కోసం భారత్‌లో పూర్తిగా విలీనం చేయకపోవడం వల్ల, దాని పర్యవసానాలను మనం నేటికీ అనుభవిస్తున్నాం.

కాని, నెహ్రూ కుటుంబ పాలనా వైఫల్యాలేవీ ప్రజలకు కనపడనీయ లేదు. ఈ దేశానికి స్వాతంత్ర్యం తెచ్చింది గాంధీ, నెహ్రూలు మాత్రమేనన్న ప్రచార ముద్రను జాతి గుండెలపై బలంగా ముద్రించారు. ఈ దేశంలో గాంధీ జయంతికి, నెహ్రూ జయంతికి తప్పితే ఇంకే త్యాగధనుల జయంతులు, వర్ధంతులకు ప్రచారం వుండదు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతికి కూడా ఓట్ల బ్యాంకు దృష్టితో సెలవు ఇస్తున్నారు కాని, లేకపోతే ఆయన చరిత్రను కూడా కాలగర్భంలో కలిపేసి ఉండేవాళ్ళే! స్వాతంత్ర్యం వచ్చాక మన దేశాన్ని ఎక్కువ కాలం పరిపాలించింది కాంగ్రెస్సే కాబట్టి గాంధీజీ, నెహ్రూలను మాత్రమే స్వాతంత్ర్య పోరాటయోధులుగా చూపించడంలో సఫలీకృతమయ్యారు. మధ్యలో వచ్చిన ఏ సంకీర్ణ ప్రభుత్వం కూడా గత చరిత్ర తేనెతుట్టెని కదిపే ప్రయత్నం చేయలేదు.

కాని, తొలిసారి నరేంద్ర మోడీ ఆ పని చేస్తున్నాడు. భారత స్వాతంత్ర్య పోరాటంలో దేశం కోసం తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టిన త్యాగధనుల చరిత్రను భావితరాలకు తెలియజెప్పాలనుకుంటున్నాడు. అందుకే గతంలో ఎప్పుడూ లేని విధంగా ఇటీవల నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఇప్పుడు పటేల్ విగ్రహంతో ఆయనను వెలుగులోకి తెచ్చారు. ఇంకా ఎంతోమంది త్యాగధనుల చరిత్రను చరిత్రపుటల్లోకి తీసుకురానున్నారు.

నరేంద్ర మోడీ అనే వ్యక్తి 2019 ఎన్నికల తర్వాత కూడా ప్రధానిగా వుంటే... మన స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రలో కొత్త పేజీలు చేరడం ఖాయం.

---

## గాంధీజీని ప్రభావితం చేసింది భగవద్గీతే!

------ షేక్ నజీర్‌బాషా గురూజీ



జాతిపిత మహాత్మాగాంధీజీని భగవద్గీత ఎంతగానో ప్రభావితం చేసిందని గీతా వైభవ్ సత్సంగ్ వ్యవస్థాపకుడు షేక్ నజీర్‌బాషా గురూజీ చెప్పారు. ఈనెల 4న ఇందుకూరుపేట మండలంలోని పల్లిపాడులో ఉన్న పినాకిని సత్యాగ్రహ ఆశ్రమంలో జరిగిన గాంధీజీ అధ్యయన తరగతుల్లో ఆయన మాట్లాడుతూ, గాంధీజీపై భగవద్గీత ఎలా ప్రభావితం చేసిందనే విషయాలను కూలంకుషంగా విద్యార్థులకు వివరించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సౌజన్యంతో జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత గాంధీజీ విగ్రహానికి, ఆశ్రమ స్థలదాత పొణకా కనకమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ కాంగ్రెస్ నాయకుడు కెవిఎన్‌రెడ్డితో పాటు, ఆశ్రమ కన్వీనర్ గణేశం కృష్ణారెడ్డి, మేనేజర్ రామయ్య, గూడూరు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.




## ఇంతకంటే దిగజారడానికి ఏముంది?

దేశ రక్షణ కోసమే కాంగ్రెస్‌తో పొత్తు అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన ప్రకటన తెలుగు ప్రజలనే నివ్వెర పరచింది. ముఖ్యంగా గత మూడున్నర దశాబ్దాలుగా కాంగ్రెస్‌తో పోరాడిన తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలకు, ఎన్టీఆర్ అభిమానులకు చంద్రబాబు చేసిన నీతిమాలిన చర్య మింగుడు పడడం లేదు. ఏ కాంగ్రెస్‌పార్టీకి అయితే వ్యతిరేకంగా అన్న నందమూరి తారకరామారావు తెలుగుదేశం పార్టీ స్థాపించాడో, అదే కాంగ్రెస్‌కు ఈరోజు చంద్రబాబు తెలుగుదేశాన్ని తాకట్టుపెట్టాడు. ముఖ్యంగా రాష్ట్ర విభజన సమయంలో సోనియాగాంధీ ఎంత దుర్మార్గంగా వ్యవహరించిందో ఆంధ్రా ప్రజలు మరువబోరు. టీవీ ప్రసారాలను ఆపేసి ప్రజలకు ఏం జరుగుతుందో తెలియకుండా పార్లమెంటు సాక్షిగా ఆంధ్రప్రదేశ్‌ను అడ్డంగా నరికారు. ఆరోజు కట్టుబట్టలతో మనల్ని గెంటేసారు. ఆంధ్రులపై కనీస దయ కూడా చూపలేదు. అప్పట్లో రాహుల్‌గాంధీ ఆంధ్రుల పట్ల కనీస సానుభూతి కూడా చూపలేదు. అలాంటి దుర్మార్గపు కాంగ్రెస్ పార్టీని నెత్తికెత్తుకున్న చంద్రబాబుకు ఈ రాష్ట్ర ప్రజలు తగిన గుణపాఠం చెబుతారు.

**కె.సి.నరసింహారావు, నెల్లూరు.**

## మతానికొక న్యాయమా?

రాజమండ్రిలోని ఓ మసీదులో మౌజన్ హత్యకు గురైతే రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీల వారు కొవ్వొత్తుల ర్యాలీలు నిర్వహించారు. వ్యక్తిగత వ్యవహారాల నేపథ్యంలో మిర్యాలగూడలో ప్రణయ్ అనే యువకుడు హత్యకు గురైతే లోకమంతా కోడైకూసింది. అక్కడెక్కడో ఒక పాస్టర్‌ను హత్య చేస్తే దేశమంతా రచ్చ చేశారు. మీడియా అదే పనిగా ఏడ్చింది. మరి వరంగల్ జిల్లాలో ఉత్తిపుణ్యానికి ఒక వృద్ధపూజారిని మత మౌఢ్యుడు దాడిచేసి చంపితే ఒక్క రాజకీయ నాయకుడూ మాట్లాడడేంటి? ఏ ఒక్క పార్టీ కొవ్వొత్తుల ర్యాలీలు చేయలేదు. మీడియా దీనిపై కథనాలు అల్లలేదు. జాతీయ నాయకులెవరూ రెక్కలు కట్టుకు వాలలేదు. అంటే ఎవరికీ హిందువులంటే లెక్కలేదు. హిందువుల ప్రాణాలకు వాళ్ళ దృష్టిలో విలువలేదు. హిందువులు ఓటు బ్యాంకుగా ఏర్పడితేనేగాని హిందువుల విలువ ఈ లౌకికవాద ముసుగులో అన్యమతాలను ప్రోత్సహించే పార్టీలకు తెలిసిరాదు.

**సి.రాజీవి, నెల్లూరు.**

## రామకృష్ణను స్ఫూర్తిగా తీసుకోవాలి

నెల్లూరుజిల్లా ఎస్పీగా 16 నెలలే పని చేసినప్పటికీ పిహెచ్‌డి రామకృష్ణ ఇక్కడి ప్రజలలో మంచి అధికారిగా పేరు తెచ్చుకున్నాడు. నిజాయితీగా పనిచేశారు. పోలీసు శాఖలో నిజాయితీ పనితీరును పెంచారు. అవినీతిపరుల ఆట కట్టించారు. ఎంతో మంది కుటుంబాలను బలితీసుకుంటున్న క్రికెట్ బెట్టింగ్‌ల భరతం పట్టి బుకీల బెండు తీసారు. ట్రాఫిక్‌ను సరిదిద్దారు. అక్రమరవాణాను అరికట్టారు. తన 16 నెలల కాలంలో జిల్లా ఎస్పీగా సమర్థవంతంగానే పని చేశాడు. కొత్త ఎస్పీ ఐశ్వర్య రస్తోగి ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ముందుకుపోవాలి.

**జి.పరమేశ్వరరెడ్డి, కావలి.**

## దేవులపల్లి అమర్‌కు అభినందనలు

ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్(ఐజేయూ) అధ్యక్షుడిగా సీనియర్ పాత్రికేయులు దేవులపల్లి అమర్ బాధ్యతలు స్వీకరించడం హర్షణీయం. ఇది తెలుగువారందరికీ గర్వకారణం. సీనియర్ పాత్రికేయులుగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రెస్ అకాడమీ ఛైర్మెన్‌గా సమర్థవంతంగా పనిచేసి జర్నలిస్టుల సంక్షేమానికి అమర్ ఎంతో కృషి చేశారు. పంజాబ్ రాజధాని అమృత్‌సర్‌లో జరిగిన ఐజేయూ 9వ జాతీయ మహాసభల్లో దేవులపల్లి అమర్ జాతీయ అధ్యక్షులుగా అక్టోబర్ 28వ తేదీన బాధ్యతలు స్వీకరించారు. ఐజేయూ నూతన అధ్యక్షులుగా ఎంపిక అయిన అమర్‌కు అభినందనలు.

**యస్.బాబురావు, కావలి.**



## హత్యలు, చోరీలతో.. నేరాలే తోరణాలై...

# రారమ్మని... రస్తోగికి ఆహ్వానం!

**నెల్లూరుజిల్లా అంటే ప్రశాంతం... మొలగొలుకుల బియ్యం... పెన్న నీళ్ళు... కోమల భోజనం... మురళీకృష్ణ స్వీట్స్... రంగనాథుడి గుడి... ఇంతకుముందు వీటి గురించి అనుకునే వాళ్ళు. రాష్ట్రంలో ఏ జిల్లాలో వున్న అధికారులైనా... తమకు నెల్లూరుకు ట్రాన్స్‌ఫర్ వచ్చిందంటే ఎగిరి గంతేసేవాళ్ళు. ఎక్కడైనా ఫ్యాక్షనిజం, నక్సలిజం వుందేమోగాని... నిన్నటివరకు నెల్లూరుజిల్లా ఆ రెండింటికీ దూరంగా వుండేది.**

ప్రశాంతతకు మారుపేరుగా నిలిచిన నెల్లూరుజిల్లా ఇప్పుడు నరహంతక ముఠాలకు స్థావరంగా మారుతోంది. ముఖ్యంగా డబ్బులు తీసుకుని మనుషులను మట్టుబెట్టే కసాయిలు నెల్లూరుజిల్లాలోకి ప్రవేశిస్తుండడం విస్తుగొలుపుతోంది. అది కూడా జిల్లా ఎస్పీగా ఐశ్వర్యరస్తోగి బాధ్యతలు చేపట్టిన తొలివారంలోనే వరుస ఘటనలు చోటుచేసుకోవడం... ఆయన కఠినంగా వ్యవహరించక తప్పదనే సంకేతాలనందిస్తున్నాయి.

కొన్నిరోజుల క్రితం నెల్లూరులోని ఆత్మకూరు బస్టాండ్ వద్ద ఓ బిల్డర్‌ను కిరాయి హంతక ముఠా దారుణంగా హతమార్చింది. ఒకప్పటి అతని వ్యాపార భాగస్వామే... వ్యాపారంలో తనకన్నా బాగా ఎదుగుతున్నాడనే అక్కసుతోనే కిరాయికి మనుషులను మాట్లాడుకుని హత్య చేయించాడు. తాజాగా ఈ నెల 3వతేదీ రాత్రి 10.20గంటల ప్రాంతంలో నెల్లూరులోని ఫత్తేఖాన్‌పేట వద్ద మహేంద్రసింగ్ అనే వ్యాపారిని గుర్తు తెలియని ఆగంతకులు తుపాకీతో కాల్చి చంపారు. ముఖాలకు ముసుగులు ధరించిన ఇద్దరు వ్యక్తులు మహేంద్రసింగ్‌పై నాలుగు రౌండ్లు కాల్పులు జరిపి బైక్‌పై పారిపోయారు. మహేంద్రసింగ్‌ను హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా అప్పటికే అతను మృతి చెందాడు. మృతుడు మహేంద్రసింగ్‌ది రాజస్థాన్. స్వగ్రామంలో వున్న వ్యక్తిగత విభేదాల కారణంగానే ఇక్కడ హత్య జరిగినట్లుగా భావిస్తున్నారు. అయినా కూడా నెల్లూరులో ఒక మనిషిని తుపాకీతో కాల్చి చంపడం అన్నది గత కొన్నేళ్ళలో

## • నగరంలో పెరిగిన నేరాలు
## • పోలీస్ సమర్ధతకు సవాళ్ళు

ఎప్పుడూ జరగలేదు. అట్లాగే గత నెల చివరివారంలో నగరంలోని కుమ్మరివీధికి చెందిన తహసీన్(34) అనే మహిళ దారుణహత్యకు గురైంది. ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో నలుగురు వ్యక్తులు ఆమెకు సైనెడ్ ఇచ్చి కిరాతకంగా చంపారు. ఈనెల 2వతేదీన నెల్లూరు బి.వి.నగర్‌లోని పానీపూరి బండి వద్ద రాజస్థాన్‌కు చెందిన ఇద్దరు అన్నదమ్ములపై బైక్‌లపై వచ్చిన యువకులు కత్తులతో విచక్షణా రహితంగా దాడికి దిగారు.

ఇక చైన్‌స్నాచింగ్‌లు, ఇళ్ళ దోపిడీలు కూడా ఎక్కువగానే వున్నాయి. గత నెలలో నెల్లూరు బాలాజీనగర్‌లోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో గొలుసుదొంగలు వీరంగం చేశారు. ఒంటరిగా నడచివెళ్తున్న ఇద్దరు మహిళల మెడల్లో బంగారు గొలుసులను తెంపుకుని వెళ్ళారు. బాలాజీనగర్ వేపదొరువు ప్రాంతానికి చెందిన సుశీలమ్మ గుడికి వెళ్ళి ఇంటికి తిరిగివస్తుండగా, ఎస్వీజిఏఎస్ కాలేజీ వద్దకు వచ్చేసరికి ఇద్దరు దుండగులు బైక్‌పై వచ్చి ఆమె మెడలోని మూడుసవర్ల బంగారు గొలుసును లాక్కెళ్ళారు. బంగారు గొలుసును గట్టిగా లాగడంతో ఆమె కిందపడిపోయి తలకు గాయమైంది. అదేవిధంగా రామ్మూర్తినగర్ నివాసి పూర్ణిమ మినీ బైపాస్‌రోడ్డులో వెళ్తుండగా గుర్తుతెలియని ఇద్దరు దుండగులు బైక్‌పై వచ్చి ఆమె మెడలోని బంగారు గొలుసును లాగారు. తాళిబొట్లు, గుండ్లు అక్కడే పడిపోగా దుండగులు అయిదు సవర్ల బంగారు గొలుసును తెంపుకుని వెళ్ళారు.

ప్రశాంతతకు మారుపేరైన నెల్లూరు జిల్లాలో ఇలాంటి హింసా సంస్కృతి బీజాలు పడడం దురదృష్టకరం. ఇవి మొలకెత్తి వృక్షాలు కాకముందే వీటిని కలుపుమొక్కల్లా ఏరివేయాలి. అంటే పోలీసు భయం రావాలి. ప్రజలలో పోలీసు అంటే భద్రత, అరాచకశక్తుల గుండెల్లో దడ ఏర్పడాలి. జైళ్లలో వుండాల్సిన పాత నేరస్తులు చాలామంది బెయిళ్ళ మీద బయటకొచ్చి యధేచ్ఛగా నేరాలకు పాల్పడుతున్నారు. అలాంటి వారి పీచమణచాలి. నేరం జరిగాక నేర పరిశోధన చేసి నిందితులను పట్టుకోవడంలో కాదు, నేరం చేయాలంటే వెన్నులో వణుకుపుట్టేలా పోలీసు పవర్ చూపాలి. రస్తోగి నుండి అలాంటి సమర్థవంతమైన పోలీసింగ్‌నే ప్రజలు ఆశిస్తున్నారు. పోలీసు అనే నాలుగో సింహాన్ని నేరస్తులకు చూపించాలి. నేరస్తులకు నెల్లూరు సురక్షిత ప్రాంతం కాదని లాఠీతో కొట్టి మరీ చెప్పాలి.

---

**• ఉదయగిరి**

# 'దేశం'లో రగడ



> ➢ **టిక్కెట్‌పై తెగని ఉత్కంఠ**
> ➢ **ఎవరి ధీమా వారిదే**
> ➢ **బొల్లినేనిపై పెరిగిన వ్యతిరేకత**

దాదాపు నాలుగున్నరేళ్ళుగా ఉదయగిరి నియోకవర్గ తెలుగుదేశం పార్టీలో ఎలాంటి వర్గ పోరు కనిపించలేదు. ఎమ్మెల్యేగా బొల్లినేని రామారావు ఏక నాయకత్వమే కనిపించింది. ఈ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయ రామిరెడ్డి పెద్ద వర్గ నాయకుడైనప్పటికీ ఆయనెప్పుడూ వర్గ రాజకీయాలను, గ్రూపు తగాదాలను ప్రోత్సహించలేదు. ఎమ్మెల్యే బొల్లినేని రామారావుతో సమన్వయంతో పనిచేశాడు. ఆయనతో కలిసిమెలిసి వున్నాడు.

అలాంటి నియోజకవర్గంలో టీడీపీలో కొత్తగా వర్గరాజకీయాలు చోటుచేసుకుంటున్నాయి. ఎన్నికలు సమీపిస్తుండడం, ఉదయగిరి టిక్కెట్ ఆశించేవాళ్ళు పార్టీలో ఎక్కువవుతుండడంతో ఇక్కడ విభేదాలు రాజుకుంటున్నాయి.


ఉదయగిరి టిక్కెట్ రేసులో సిటింగ్ ఎమ్మెల్యేగా బొల్లినేని రామారావుతో పాటు కంభం విజయరామిరెడ్డి, కావ్య కృష్ణారెడ్డిలు కూడా వున్నారు. బొల్లినేని రామారావుకు వీళ్ళిద్దరితో సమస్య లేదు. టిక్కెట్ విషయంలో వీళ్ళిద్దరూ సిటింగ్ ఎమ్మెల్యే బొల్లినేని రామారావు సహకారం కోరి వున్నారు.

కాని టిక్కెట్ రేసులో వున్న సీఎం ప్రోటోకాల్ ఆఫీసర్ అశోక్‌బాబు గాని, వరికుంటపాడు మండలం పార్టీ కన్వీనర్ ఎర్రా చినబ్రహ్మయ్య గాని బొల్లినేనిని పట్టించుకోలేదు. ఆయనను కలవకుండానే టిక్కెట్ విషయంలో తమ ప్రయత్నాలు తాము చేసుకోసాగారు. ఈ విషయంపైనే ఇటీవల ఉదయగిరి ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో ఎమ్మెల్యే బొల్లినేని రామారావుకు, అశోక్‌బాబుకు మధ్య వాదన జరిగినట్లు తెలుస్తోంది. అలాగే ఇటీవల వరికుంటపాడులో మండల పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించగా బొల్లినేని వర్గీయులకు, ఎర్రా చినబ్రహ్మయ్య వర్గీయులకు మధ్య గొడవ జరిగింది. ఎమ్మెల్యే బొల్లినేని రామారావు ఫోటో లేకుండా ఎర్రా చిన్నబ్రహ్మయ్య ఆదాల ప్రభాకర్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ ప్రకటన ఇవ్వడాన్ని తప్పుపడుతూ బొల్లినేని వర్గీయులు వాదనకు దిగారు. ఈ గొడవ నేపథ్యంలోనే పార్టీ నుండి ఎర్రా చిన్నబ్రహ్మయ్యను సస్పెండ్ చేశారు. కొత్తగా మండల కన్వీనర్ బాధ్యతను చంద్ర మధుకు అప్పగించడంతో ఒక వర్గం వాళ్ళు బొల్లినేనిపై ఆగ్రహంతో ఊగిపోతున్నారు. మా ఊర్లలోకి ఎలా వస్తారో చూస్తామంటూ బొల్లినేనిపై కారాలు మిరియాలు నూరుతున్నారు. మొత్తానికి ప్రశాంతంగా వుందనుకున్న ఉదయగిరి తెలుగుదేశంలోనూ ముసలం పుట్టినట్లయ్యింది.

---

**• నెల్లూరుకు..**

# అర్జెంటుగా ఫ్లైఓవర్లు కావాలి



**నెల్లూరు నగరం మరియు చుట్టుపక్కల ఫ్లైఓవర్ వంతెనల అవసరం ఎంతైనా వుంది. నగరంలో ట్రాఫిక్‌ను అరికట్టాలన్నా, ప్రమాదాలను తగ్గించాలన్నా వీటిని మొదలుపెట్టాల్సివుంది.**

నెల్లూరు నగరం మధ్యలో నుండి వెళ్ళే రైల్వే ట్రాక్ నగరాన్ని రెండు భాగాలుగా విభజిస్తోంది. తూర్పు, పడమర భాగాలుగా విడిపోయిన నగరాన్ని కలపడానికి నాలుగు అండర్‌బ్రిడ్జిలు, ఆరు రైల్వే గేట్లు, ఒక ఫ్లైఓవర్ వుంది. ఈ ఫ్లైఓవర్ బ్రిడ్జి నగరానికి శివార్లలో అయ్యప్పగుడి వద్ద వుండడంతో ట్రాఫిక్ పరిష్కారానికి పెద్దగా ఉపయోగం లేదు. నాలుగు అండర్‌బ్రిడ్జిలు(ఆత్మకూరు బస్టాండ్, విజయమహల్‌గేట్, రామలింగాపురం, మాగుంట లేఅవుట్) ఎప్పుడూ ట్రాఫిక్ రద్దీతో వుంటాయి. పెరిగిన వాహన తాకిడికి అనుగుణంగా ఈ బ్రిడ్జిలు వెడల్పుగా లేకపోవడంతో తరచూ ట్రాఫిక్‌జామ్ ఏర్పడుతుంటుంది. పాత చెక్‌పోస్టు, రంగనాయకులపేట, విజయమహల్‌గేటు, కొండాయపాలెం గేటు, బి.వి.నగర్, వేదాయపాలెం రైల్వే గేట్ల వద్ద కూడా నిత్యం ట్రాఫిక్ సమస్యే! ఇటీవల రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఢిల్లీలో కేంద్ర రైల్వే మంత్రిని కలిసి కొండాయపాళెం, బి.వి.నగర్‌ల వద్ద రైల్వే అండర్, ఓవర్ బ్రిడ్జిలను మొదలుపెట్టి పూర్తి చేయాలని కోరారు. నగరంలో వున్న నాలుగు అండర్ బ్రిడ్జిలు కూడా వర్షాకాలంలో నీటితో నిండిపోతాయి. అటు ఇటు రాకపోకలకు ఇబ్బందిగా వుంటుంది. కాబట్టి నగర ప్రజలకు అనువుగా దగ్గరగా వుండేలా కొండాయపాలెం లేదా బి.వి.నగర్‌ల వద్ద ఒక రైల్వే ఓవర్ వంతెన మాత్రం వెంటనే చేపట్టాలి. అలాగే మద్రాసు బస్టాండ్ సెంటర్ నుండి రెడ్‌క్రాస్ సందులోగుండా ముత్యాలపాలెం వరకు రైల్వే ఓవర్ వంతెనకు ప్లాన్ చేస్తున్నారు. ఈ వంతెన ఆచరణ రూపంలోకి వస్తే వాహనాదారుల నెత్తిన పాలు పోసినట్లే! ఎక్కువ శాతం మంది వాహనదారులకు ఉపయోగపడే వంతెన ఇది.

ఇక నగర పరిధిలో జాతీయ రహదారి జంక్షన్‌ల వద్ద కూడా ఫ్లైఓవర్ వంతెనలు వెంటనే నిర్మించాల్సివుంది. ముఖ్యంగా సింహపురి ఆసుపత్రి జంక్షన్, కనుపర్తిపాడు క్రాస్, అయ్యప్పగుడి జంక్షన్‌లు ప్రమాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతున్నాయి. జాతీయ రహదారిని ఆరులైన్లుగా విస్తరించకపోవడం వల్ల ఇక్కడ వంతెనలు రాలేదు. విస్తరించిన చోటల్లా ప్రతి క్రాస్ వద్ద ఫ్లైఓవర్‌లు వచ్చాయి. నెల్లూరు – తడ జాతీయ రహదారి ఆరులైన్ల విస్తరణకు ఇంకా ఏడాదిపైనే పట్టేటట్లుంది. అప్పటిదాకా ఈ సెంటర్‌లలో ఫ్లైఓవర్లు కట్టకపోతే ఎన్ని ప్రమాదాలు జరుగుతాయో, ఇంకెన్ని ప్రాణాలు పోతాయో...!




# నెల్లూరు కబుర్లు

## ధర్మపోరాటం 20కి వాయిదా!



నెల్లూరులో ఈ నెల 10వ తేదీన జరపాల్సిన తెలుగుదేశం పార్టీ వారి ధర్మపోరాటదీక్ష 20వ తేదీకి వాయిదా పడింది. ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొనే ఈ ధర్మపోరాట దీక్ష కోసం నెల్లూరు, జాతీయ రహదారి పక్కన శ్రీ వేణుగోపాలస్వామి కాలేజీ మైదానాన్ని సిద్ధం చేశారు. ఆగస్టులో ఇక్కడ తెలుగుదేశం - దళిత తేజం సదస్సు కూడా నిర్వహించి వున్నారు. ఈ మైదానం అయితే అనుకూలంగా వుంటుందని ధర్మపోరాట దీక్ష అక్కడ పెట్టారు. అయితే వాతావరణ పరిస్థితుల దృష్ట్యా 20వ తేదీకి వాయిదా వేశారు.

## తొలి గ్రీవెన్స్‌డేలో రస్తోగి!



జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టాక ఐశ్వర్య రస్తోగి ఈ నెల 6వ తేదీ సోమవారం తొలి ప్రజావిజ్ఞప్తుల దినంలో పాల్గొన్నారు. పోలీసు పరేడ్ గ్రౌండ్‌లోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్‌హాల్‌లో పొద్దున పది గంటలకు గ్రీవెన్స్‌డే మొదలవగా ఆయనే స్వయంగా వచ్చి ప్రజల నుండి అర్జీలు స్వీకరించి, వారి బాధలు విన్నారు. మధ్యలో ఒకసారి తన బంగ్లాకు వెళ్ళినా ఆయన మళ్ళీ అప్పుడే తిరిగొచ్చేసి విజ్ఞప్తులు స్వీకరించారు. మధ్యాహ్నం 3.30గంటలకు అందరూ అర్జీదారుల బాధలు విన్నాక ఆయన భోజనానికి ఇంటికి వెళ్లారు.

### కోర్టు ఆదేశాలు తుస్సుమనిపించారు...

## దీపావళిని మోగించేశారు

దీపావళి పండుగ నాడు రాత్రి 8గంటల నుండి 10గంటల వరకే బాణాసంచా కాల్చాలి అంటూ సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలు తుస్‌మన్నాయి. మా సంస్కృతి, మా పండుగ... మధ్యలో మీ ఆంక్షలేంటంటూ 7వ తేదీన నెల్లూరు నగరంలో దీపావళి పండుగను ప్రజలు బ్రహ్మాండంగా జరుపుకున్నారు. బాణాసంచా ధరలు మోతెక్కించినా లెక్కచేయలేదు. సంవత్సరానికి ఒకసారొచ్చే పండుగ... అన్ని పండుగలలోకి భిన్నమైన పండుగ...టపాకాయలు పేల్చి సరదా తీర్చుకునే పండుగ. పిల్లకాయలు ఊరుకుంటారా! రోజువారీ ఖర్చులైనా తగ్గించుకుంటాంగాని, టపాకాయలు కాల్చడం మాత్రం తగ్గించం అన్నట్లు ఒక్కొక్కరు వేల రూపాయల్లో టపాసులు కొన్నారు. 6, 7తేదీలలో నరకచతుర్ధశి, దీపావళి నాడు ఆకాశం దేదీప్యమానమయ్యేలా బాణాసంచా పేల్చారు. ఈ 2రోజులు వర్షం కూడా లేకపోవడంతో బాణాసంచా వ్యాపారులకూ నాలుగు రూపాయలొచ్చాయి.

### నగరంలోకి

## 'లేడీ కేడీ'లు

నగరంలో మహిళా దొంగలు సంచరిస్తున్నారు. వీళ్ళు ఆటోలలో ప్రయాణీకుల మాదిరిగా ఎక్కడం, తోటి ప్రయాణీకులను మాటల్లోకి దించడం, వారిని ఏమార్చి వారివద్దనున్న నగదు, నగలు కొట్టేయడం చేస్తున్నారు. ఇటీవల నారాయణ ఆసుపత్రికి పోవడానికి వి.ఆర్.సి సెంటర్ వద్ద ఆటో ఎక్కిన ఓ ప్రయాణికురాలిని అలాగే దోచుకున్నారు. అదే విధంగా ఆత్మకూరు బస్టాండ్ వద్ద ఆర్టీసీ బస్టాండ్‌కు పోవడానికి ఆటో ఎక్కిన మరో ప్రయాణికుడిని మాటల్లోకి దింపి, చంద్రబాబునగర్‌కు తీసుకెళ్ళి ఇలాగే దోచుకున్నారు. ఆటోలో ఎక్కేవాళ్ళు ఇలాంటి వారి పట్ల జాగ్రత్త వహించాలి.

### విజయలో

## నాణ్యత 'పెరుగు'

నెల్లూరులోని విజయ డెయిరీలో పెరుగు నాణ్యత పెంచేందుకోసం 15 లక్షలతో కొత్త యంత్రాలను తెచ్చిపెట్టారు. వీటిని 5వ తేదీన డెయిరీ యం.డి కె.కృష్ణ మోహన్ ప్రారంభించారు. వినియోగదారులకు రుచి, శుచి, నాణ్యతతో కూడిన పెరుగును అందించడం కోసం ఈ యంత్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డెయిరీ అధికారులు రాజశేఖర్‌రెడ్డి, సుందర్‌రావు, పి.సి.కృష్ణమోహన్, మదన్‌నాయక్, శ్రీనివాసులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

### 'మాబూ' ఏఐటియుసి

## రాష్ట్ర కార్యదర్శి అయ్యాడు



ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శిగా ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకులు షేక్ మాబూ ఎన్నికయ్యారు. నెల్లూరు ఆర్టీసీ కార్యాలయంలో రిజర్వేషన్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న మాబూ యూనియన్ కార్యకలాపాలలో చురుగ్గా పాల్గొంటుంటారు.

## శుభమస్తులో దీపావళి డ్రా



డ్రా తీసి విజేతను ప్రకటిస్తున్న నవీన్‌కుమార్

దీపావళి పండుగ సందర్భంగా నెల్లూరు శుభమస్తు షాపింగ్ మాల్ అధినేతలు తిరుపతి, నెల్లూరు శాఖల్లో ఏడు రోజులు, ఏడు స్కూటర్లు బహుమతులుగా కస్టమర్లకు ప్రకటించారు. ప్రతి రూ.500 కొనుగోలుపై లక్కీడ్రా కూపన్ ఇచ్చి ప్రతిరోజు డ్రా తీస్తున్నారు. అందులో భాగంగా ఈనెల 6వ తేది తీసిన ఆరవ డ్రాలో తిరుపతికి చెందిన వి.వసుంధర హీరో డ్యూయట్ స్కూటర్‌ను గెలుచుకున్నారు. ముఖ్యఅతిథిగా నెల్లూరు అపోలో సూపర్ స్పెషాలిటి హాస్పిటల్ యూనిట్ హెడ్ వి.నవీన్‌కుమార్ పాల్గొని లక్కీ డ్రా విజేతను ప్రకటించారు. షాపింగ్ మాల్ అధినేత బయ్యా శ్రీనివాసులు మాట్లాడుతూ బంపర్ డ్రా స్కూటర్లతో పాటు ఎన్నో ఆఫర్లు ఉన్నాయని, ఎవ్వరూ ఇవ్వలేని విధంగా రూ.500లకు 5 కాటన్ చీరలు, రూ.500లకు 5ప్యాంటు బిట్లు, బాయ్స్ టీ-షర్ట్స్, గర్ల్స్ టాప్స్, బాయ్స్ ప్యాంట్ కేవలం రూ.100లకే ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## కార్తీక మాసం వచ్చేసింది!



ఏడాదిలోకల్లా అత్యంత పవిత్రంగా భావించే కార్తీకమాసం వచ్చేసింది. దీపావళి పండుగ పక్కరోజు నుండే కార్తీక మాసం మొదలవుతుంది. ఏ ఏడాదికా ఏడాది కార్తీక మాసం యొక్క ప్రాధాన్యత పెరుగుతోంది. ఒకప్పుడు కార్తీకమాసం అంటే మహిళలే పూజలు, వ్రతాలు చేస్తుండేవాళ్ళు. ఇప్పుడు మగభక్తులు కూడా పెరిగారు. ఈ నెలరోజుల పాటు మద్యం, మాంసం వంటి వాటికి దూరంగా వుండడమే కాక నిత్య శివపూజల్లో పాల్గొంటున్నారు. కార్తీకమాసం సందర్భంగా నగరంలోని అన్ని శివాలయాలను ముస్తాబు చేశారు. ఈ నెల రోజులు శివాలయాలు భక్తులతో కిటకిటలాడుతుంటాయి. కార్తీక దీపాలతో కళకళలాడుతుంటాయి. ముఖ్యంగా మూలాపేటలోని మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంకు భక్తులు పోటెత్తి వస్తుంటారు. సోమవారాలు, కోటి సోమవారం, కార్తీక పౌర్ణమి రోజుల్లో అయితే భక్తులు కిక్కిరిసి పోతుంటారు. కార్తీక మాసం సందర్భంగా మూలాపేట శివాలయంలో భక్తుల కోసం చేయాల్సిన ఏర్పాట్లపై నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్ సమీక్షించారు. అలాగే అన్ని శివాలయాలలోనూ ఆయా ఆలయ కమిటీలు కార్తీక మాసం సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాయి.

### పనిలోకి

## ఏఆర్ ఎస్ఐలు

నగరంలో ఈవ్‌టీజింగ్, చైన్ స్నాచింగ్, దొంగతనాలు, ట్రాఫిక్ వంటి వాటిని నియంత్రించేందుకు ఏఆర్ ఎస్ఐలు పదిమందికి నెల్లూరు నగర సబ్‌డివిజన్‌కు అటాచ్ చేస్తూ ఎస్పీ ఐశ్వర్యరస్తోగి నిర్ణయం తీసుకున్నారు. వాహనాల తనిఖీలు, పెట్రోలింగ్ డ్యూటీలు, స్పెషల్ స్క్వాడ్స్‌గా వీరిని వాడుకుంటారు. సబ్‌డివిజన్‌కు అటాచ్ చేసిన ఏఆర్ఎస్ఐలలో పి.నాగశివారెడ్డి, ఏ.సుధాకర్, సిహెచ్ కోటిరెడ్డి, ఎం.పుల్లారెడ్డి, పి.వి.సుబ్బారావు, సి.హెచ్.నారాయణస్వామి, యు.పాల్‌రాజు, జి.ఏడుకొండలు వున్నారు.

### స్త్రీల కోసం.. ఇక

## 'మహిళా' రక్షక్‌లు


నగరంలో ఆకతాయిల వేధింపుల నుండి మహిళలకు భద్రత కల్పించేందుకు జిల్లా ఎస్పీ ఐశ్వర్య రస్తోగి మూడు మహిళా రక్షక్ బృందాలను ఏర్పాటు చేశారు. ఒక్కో బృందంలో మగ కానిస్టేబుళ్ళతో పాటు మహిళా కానిస్టేబుల్ కూడా వున్నారు. ఈ బృందాలు మఫ్టీలో కళాశాలలు, షాపింగ్‌మాల్స్, ఆసుపత్రులు, థియేటర్లు, బస్టాప్‌లు వంటి ప్రాంతాల్లో కాపుకాస్తుంటాయి. మహిళల పట్ల ఎవరన్నా అసభ్యంగా ప్రవర్తిస్తున్నా, ఇంకే రకంగానన్నా వేధింపులకు గురిచేస్తున్నా వెంటనే పట్టుకుని పోలీసు స్టేషన్‌కు తరలిస్తుంటారు.




జనసేనకు జైకొట్టి...

# గురువుపైనే గురిపెడతాడా?

## చిటపటలాడుతున్న అబ్దుల్ అజీజ్



నెల్లూరు మేయర్ అబ్దుల్ అజీజ్.. 2019 ఎన్నికల్లో నెల్లూరు సిటీ సీటుపై ఎన్నో ఆశలు పెట్టుకుని వున్నాడు. నగరంలో ముస్లింలు ఎక్కువ. ఇటు చూస్తే అతను మేయర్. లోకేష్‌ను ఇంతకు ముందే లైన్‌లో పెట్టేసి వున్నాడు. సీటు రేసులో బలంగా వుండాలని చెప్పే ఈ మధ్య గుంటూరులో నిర్వహించిన 'నారా హమారా – టీడీపీ హమారా' ముస్లింల సదస్సుకు నెల్లూరు నుండి ముస్లింలను భారీసంఖ్యలో తీసుకుని వెళ్లాడు. రాష్ట్రంలోని 175 సీట్లలో ముస్లింలకు ఎన్నోకొన్ని సీట్లు కేటాయించాల్సి వుంటుంది. ఈ జాబితాలో నెల్లూరుసిటీని కూడా చేర్చే విధంగా అజీజ్ ప్రయత్నాలు చేసాడు. అజీజ్ ఇంతగా ఆశలు పెట్టుకున్నా నెల్లూరు లోక్‌సభలో ఆదాల ప్రభాకర్‌రెడ్డి గెలవాలంటే నెల్లూరుసిటీకి బలమైన అభ్యర్థి కావాలి అన్న ఆలోచనే అజీజ్ ప్రయత్నాలను బ్రేక్ చేస్తుంది. తాను నెల్లూరు లోక్‌సభకు పోటీ చేయాలంటే నెల్లూరుసిటీ నుండి మంత్రి పి.నారాయణను దించాలని ఆదాల ప్రభాకర్‌రెడ్డి గట్టిగా చంద్రబాబునే పట్టుబడుతున్నాడు. చంద్రబాబు కూడా అందుకు పచ్చజెండా ఊపాడని, నెల్లూరుసిటీ అభ్యర్థి నారాయణేనని మీడియాలో వచ్చింది. అప్పటినుండి అజీజ్ అగ్గిమీద గుగ్గిలం అవుతున్నాడు. అటు మంత్రి నారాయణ, ఇటు ఆదాల ప్రభాకర్ రెడ్డిలకు దూరంగా వుంటున్నాడు. టీడీపీ సీటు కోసం ప్రయత్నాలు ఆపడం లేదు. ఒకవేళ టీడీపీ సీటు ఇవ్వకుంటే చివర్లో జనసేనకైనా జైకొట్టి గురువు నారాయణకే గురిపెట్టేటట్లున్నాడు.



# మంచితనపు సిరులు... గిరిజనులు

**- సోమిరెడ్డి ప్రశంసలు**

గిరిజనులు మంచితనానికి మారుపేరని, విశ్వాసానికి ప్రతిరూపమని రాష్ట్ర వ్యవసాయశాఖా మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 4వ తేదీన నెల్లూరులోని హరిత హోటల్‌లో గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం, యానాదుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గిరిజన ఆణిముత్యాల సన్మానసభ జరుగగా, సోమిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై గిరిజనుల పట్ల తనకున్న ప్రేమను తన మాటల్లో చాటుకున్నారు. గిరిజనులంటే సాక్షాత్తూ ఆ పరమశివుడి మనుషులని, భారతీయ జీవన విధానంలో వారికెంతో ప్రాధాన్యత వుందని చెప్పారు. ఈ సందర్భంగా వ్యవసాయ కుటుంబం నుండి ఐపిఎస్ సాధించిన అద్దూరి శ్రీనివాసులును, 70ఏళ్ళ అంతర్జాతీయ వెటరన్ అథ్లెటిక్ మాణికల రామసుబ్బమ్మను, ఎవరెస్ట్ పర్వతాన్ని అధిరోహించిన విద్యార్థి ఇండ్ల వెంకటేష్‌లను ఆయన ప్రశంసించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బీద రవిచంద్ర, సబ్‌రిజిస్ట్రార్ అద్దూరి గోపాల్, గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు చేవూరి సుబ్బారావు, పులి చెంచయ్య, యానాదుల సంక్షేమ సంఘం నాయకులు కె.రామచంద్రయ్య, కె.సి. పెంచలయ్య, చంద్రమౌళి, మురళి తదితరులు పాల్గొన్నారు.

మీ ఆరోగ్యమే..

# నాకు మహాభాగ్యం!

**- కోటంరెడ్డి శ్రీధర్**



తనకు ఓటేసి తనను ఆశీర్వదించిన నెల్లూరు రూరల్ నియోజకవర్గ ప్రజలు నిత్యం ఆరోగ్యవంతులుగా వుండాలన్నది తన ఆకాంక్ష అని, వారి ఆరోగ్యమే తనకు మహాభాగ్యమని గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అంటున్నారు. నెల్లూరు కార్పొరేషన్ పరిధిలోనే వుంటున్నప్పటికీ, వైద్య సదుపాయాలకు దూరంగా వుంటున్న కొత్తూరు, వైయస్సార్‌నగర్‌లోని పేద, మధ్యతరగతి ప్రజల కోసం అపోలో ఆసుపత్రి వారి సహకారంతో ఈ నెల 4న వైయస్సార్‌నగర్‌లోని ఆపిల్‌బెర్రీ పాఠశాలలో ఉచిత మెడికల్ క్యాంపును ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి ఈ శిబిరాన్ని పర్యవేక్షిస్తూ వచ్చిన వ్యాధిగ్రస్తుల మంచి చెడ్డలు తెలుసుకున్నారు. పేద ప్రజలకు చంద్రబాబు ప్రభుత్వం ఆరోగ్యశ్రీని సక్రమంగా అమలు చేయడం లేదని, పేదల కోసం నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలలో 30ఉచిత మెగా వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించానని చెప్పారు. పేషంట్లకు ఉచితంగా మందులు అందించడమే కాక అవసరమైన వారికి ఆపరేషన్లు కూడా చేయిస్తామని శ్రీధర్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఈ శిబిరంలో అపోలో వైద్యులు దినేష్‌కుమార్‌రెడ్డి, గిరీష్‌కుమార్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, కిషోర్‌చంద్రారెడ్డి, స్వప్న, సహజ, మనోహర్, అనూష్‌ధర్ తదితరులు పాల్గొని తమ వైద్యసేవ లందించారు.

కష్టాల్లో వున్నోళ్ళ..

# కన్నీళ్ళు తుడుస్తున్నాడు పేర్నాటి శ్యాం

సమయం లేదు... సందర్భం లేదు... జిల్లా అని కాదు, రాష్ట్రం అని కాదు... బాధల్లో వున్న బాధితులు ఎక్కడ వున్నా, అది ఏ సమయమైనా వెళ్లి తమవంతు చేయూతనందించాలన్నదే పేర్నాటి ఛారిటబుల్ ట్రస్ట్ లక్ష్యం. వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు పేర్నాటి శ్యాం ప్రసాద్‌రెడ్డి ఏర్పాటు చేసిన పేర్నాటి ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా జిల్లాలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. అలాగే దేశంలో ఎక్కడ ప్రకృతి వైపరీత్యాలు సంభవించినా ఈ ట్రస్ట్ ప్రతినిధి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి నేతృత్వంలో ట్రస్ట్ సభ్యులు స్వయంగా సంబంధిత ప్రాంతాలకు వెళ్లి బాధితులకు తమ సహాయసహకారాలను అందిస్తుంటారు. ఇటీవల కేరళను వరదలు ముంచెత్తినప్పుడు బాధితులను ఆదుకోవడం కోసం పేర్నాటి ఛారిటబుల్‌ట్రస్ట్ అక్కడ పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలను నిర్వహించింది. నెల్లూరు నుండే భారీగా నిత్యావసర వస్తువులు, దుస్తులు, వంట సామాగ్రి వంటివి తరలించి బాధితులకు అందజేసారు.



తాజాగా తిత్లి తుఫాన్‌తో అతలాకుతలమైన శ్రీకాకుళం జిల్లాలో తుఫాన్ బాధితులకు ఆపన్నహస్తం అందించారు. పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో ట్రస్ట్ బృందం మూడురోజుల పాటు శ్రీకాకుళం జిల్లాలోని పలు గ్రామాలలో తుఫాన్ బాధితులకు నిత్యావసర సరుకులు, బట్టలు వంటివి అందజేసి తమ మానవతను చాటుకున్నారు.

## బ్యాంకాక్ సదస్సుకు డాక్టర్ జగదీష్



నెల్లూరులోని నాయుడమ్మ సెంటర్ ఫర్ డెవలెప్‌మెంట్ ఆల్టర్నేటివ్స్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ జగదీష్ ఈనెల 26 నుండి 28 వరకు బ్యాంకాక్‌లో జరిగే అగ్రిపేస్ 2018 అంతర్జాతీయ సదస్సులో ప్రధానవక్తగా పాల్గొంటారు. ఈయన ఇంధన వనరులు, వాతావరణం అప్రాప్రియేట్ టెక్నాలజీపై విశేష కృషి చేసారు. 150 అంతర్జాతీయ, జాతీయ వైజ్ఞానిక పత్రికలలో వ్యాసాలు ప్రచురించారు. 40దేశాలలో జరిగిన అంతర్జాతీయ సదస్సులలో పాల్గొన్నారు. ప్రతిష్టాత్మకమైన మార్గరేట్ నోబుల్ ఫౌండేషన్, సీటెల్, అమెరికా అవార్డుతోపాటు, 15 అంతర్జాతీయ, జాతీయ అవార్డులు అందుకున్నారు.




## ఆరోగ్య పథకాలతో ఆదరణ పొందుతున్న లీడర్

# డాక్టర్ అనిల్



'రాజన్న గుండె భరోసా' కార్యక్రమాన్ని ప్రారంభించిన మాజీఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి

నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్ ప్రజలకు లీడర్‌గానే తెలుసు. కాని అతను డాక్టర్ కూడా! కాబట్టే లీడర్‌గా వుంటూనే ఒక డాక్టర్‌గా తన ఆలోచనా తీరుతో తన నియోజకవర్గ ప్రజలకు తనశక్తి మేరకు వైద్య సేవలందించడానికి ఉద్యుక్తుడయ్యాడు. ఈ పరంపరలోనే అక్టోబర్ 2వ తేదీ గాంధీ జయంతి నాడు మాడరన్ కంటి ఆసుపత్రి వారి సహకారంతో రాజన్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించిన అనిల్ నగర నియోజకవర్గ పరిధిలో 7వేల మందికి కంటి పరీక్షలు చేయించి, రెండు వేల మందికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. 150మందికి కంటి ఆపరేషన్లు కూడా చేయించాడు.

ఎక్కువమంది ప్రజలు ఆరోగ్యపరంగా ఎదుర్కొంటున్న సమస్య గుండె జబ్బు. తన నియోజకవర్గంలో ప్రజలకు ఈ విభాగంలోనూ వైద్య సేవలందించడం కోసం అనిల్ ఈనెల 4వతేదీ నుండి 'రాజన్న గుండె భరోసా' కార్యక్రమానికి కూడా శ్రీకారం చుట్టాడు. నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లో హృద్రోగులను కవర్ చేసేలా ప్రతి ఆదివారం గుండె వ్యాధుల వైద్య శిబిరాలు నిర్వహించి, ఉచితంగా మందులు ఇవ్వడమే కాక అవసరమైనవారికి ఆపరేషన్లు చేయించడానికి కూడా సిద్ధంగా వున్నాడు.

4వ తేదీన మాజీ పార్లమెంటు సభ్యులు మేకపాటి రాజమోహన్‌రెడ్డి 'రాజన్న గుండె భరోసా' కార్యక్రమాన్ని ప్రారంభించాడు. కార్తీ హార్ట్ ఫౌండేషన్ వారి సహకారంతో ప్రతి డివిజన్‌లోనూ గుండె వైద్యశిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఈ సందర్భంగా అనిల్ తెలిపాడు.

# చట్ట వ్యతిరేకులకు ఇక సింహస్వప్నమే

## - కొత్త ఎస్పీని కొనియాడిన పోలీసు సంఘం నాయకులు



నూతన ఎస్పీ ఐశ్వర్య రస్తోగికి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందిస్తున్న పోలీసు సంఘం నాయకులు

రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు జనకుల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పలువురు ఆ సంఘం ప్రతినిధులు ఈనెల 3న కొత్త ఎస్పీగా వచ్చిన ఐశ్వర్య రస్తోగిని మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛంతో అభినందించారు.

ఈ సందర్భంగా జనకుల మాట్లాడుతూ, కొత్త ఎస్పీ డేరింగ్ అండ్ డైనమిక్ ఆఫీసర్ అని, ఆయన శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా ఎస్పీగా రావడం జిల్లాకు శుభ పరిణామమన్నారు. చట్ట వ్యతిరేకులకు ఇక సింహస్వప్నమేనంటూ ఎస్పీని కొనియాడారు. పోలీసు సంక్షేమానికి పెద్దపీట వేయడం ఆయన దార్శనికతకు నిదర్శనమన్నారు. ఎక్కడ సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తారో అక్కడ పోలీసులు మరింత చురుకుగా పనిచేసే అవకాశం ఉందన్నారు. కొత్త ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన తరువాత ఆయన న్యాయబద్ధమైన ప్రతిసమస్యను పరిష్కరిస్తాననడం, సిబ్బంది ప్రమోషన్స్ విషయంలో జాప్యం లేకుండా చేస్తాననడం ఎంతో హర్షదాయకమన్నారు. ఇలాంటి అధికారి వెంట ఎల్లవేళలా రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం ఉంటుందన్నారు. ఎస్పీని కలసినవారిలో జిల్లా పోలీసు అధికారుల సంఘం కోశాధికారి కె. బాబు, జాయింట్ సెక్రటరీ పి.వీరాంజనేయులు, జిల్లా పోలీస్ కోఆపరేటివ్ సొసైటీ కోశాధికారి కె.జాన్, రాష్ట్ర కో-ఆప్షన్ సభ్యులు కె.ఎస్ రాజు, నెల్లూరు పోలీసు అధికారుల సంఘం సభ్యులు బివి నరసయ్య, వి.భాస్కర్, ఎస్‌పి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## వైసిపి వైపు..

# పొణకా చూపు!

## • మారనున్న రాజకీయ సమీకరణలు

గూడూరు పురపాలక ఛైర్‌పర్సన్ పొణకా దేవసేన, ప్రముఖ పారిశ్రామిక వేత్త పొణకా శివకుమార్‌రెడ్డిలు టీడీపీకి గుడ్‌బై చెప్పి వైకాపాలో చేరనున్నట్లు జోరుగా గూడూరు టౌన్‌లో ప్రచారం సాగుతోంది. ఈమేరకు పొణకా దంపతులతో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి మంతనాలు జరిపినట్లు విశ్వసనీయ సమాచారం. జిల్లాలోని ఓ మంత్రి వ్యవహార శైలిపై గుర్రుగా వున్న వీరు పార్టీని వీడే ఆలోచనల్లో వున్నట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని గుర్తించిన ప్రతిపక్ష పార్టీ నాయకులు విజయసాయిరెడ్డి ద్వారా నేరుగా ఫోన్‌లో సంప్రదింపులు జరిపినట్లు తెలుస్తోంది. పొనకా దంపతులు వైకాపాలో చేరితే గూడూరులో తెలుగుదేశంపార్టీకి తీరని నష్టం జరిగే ప్రమాదముందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. గూడూరు అభివృద్ధికి పురపాలక సంఘ నిధులతో సంబంధం లేకుండా సొంత నిధులను సైతం వెచ్చించి పలు అభివృద్ధి పనులను చేపట్టి పట్టణ ప్రజల మన్ననలను పొందారు పొణకా దంపతులు. ఈ క్రమంలో పార్టీ మారే విషయంలో అటు కౌన్సిలర్లతో పాటు ఇటు ప్రజల నుంచి కూడా పూర్తి మద్దతు లభిస్తోందని అంటున్నారు. ఛైర్‌పర్సన్ పదవి చేపట్టినప్పటి నుంచి ఎలాంటి మచ్చలేకుండా అభివృద్ధి పనులు చేస్తున్న పొణకా దేవసేన, పారిశ్రామికవేత్త పొణకా శివకుమార్‌రెడ్డిలు రాజకీయ భవిష్యత్తు కోసం ఏ నిర్ణయం తీసుకున్నా తామంతా వారివెంటే నడిచేందుకు సిద్ధంగా వున్నట్లు పలువురు కౌన్సిలర్లు తమ అభిప్రాయాలను వ్యక్తం చేసినట్లు సమాచారం. జిల్లాకు చెందిన రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డిలు సైతం పార్టీలోకి రావాలని పొణకా దంపతులను కోరినట్లు సమాచారం. ఇదే జరిగితే రాబోవు ఎన్నికల్లో గూడూరు టీడీపీకి గట్టి ఎదురుదెబ్బ తగిలే అవకాశం లేకపోలేదు.

# గూడూరు డివిజన్ వార్తలు

## ఎన్‌బికెఆర్‌లో..

# క్యాంపస్ ఎంపికలు

కోట మండలంలోని విద్యానగర్‌లో ఉన్న ఎన్‌బికెఆర్ ఐఎస్‌టి ఇంజనీరింగ్ కళాశాలలో ఇటీవల క్యాంపస్ ఎంపికలు నిర్వహించారు. చెన్నైకి చెందిన ఎల్.క్యూబ్ అనే సాఫ్ట్‌వేర్ సంస్థ బిటెక్ ఆఖరి సంవత్సరం చదువుతున్న సిఎస్‌ఇ, ఇసిఇ, ట్రిబుల్ ఇ విద్యార్థులకు ఈ ఎంపికలు నిర్వహించింది. కంపెనీ ప్రతినిధి మగ్దూమ్ ఆలీ తన బృందంతో వచ్చి ముందుగా తమ కంపెనీ గురించి విద్యార్థులకు వివరించారు. ప్రోగ్రామింగ్‌పై విద్యార్థులకు ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించి, దీనిలో ఎంపికైన విద్యార్థులతో చర్చ నిర్వహించారు. ఆ తర్వాత జరిగిన ఇంటర్వ్యూలకు 120 మంది విద్యార్థులు హాజరయ్యారు. కళాశాల ప్రాంగణ ఎంపికల అధికారి డాక్టర్ ఎన్.కిషొంధర్, శిక్షణా సిబ్బంది పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది.

## ప్రతి పేదోడికీ..

# అన్నం పెట్టడమే లక్ష్యం

### - మంత్రి పి. నారాయణ



అన్నక్యాంటీన్ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి నారాయణ, ఎమ్మెల్యే పాశం, ఛైర్‌పర్సన్ దేవసేవ

రాష్ట్రంలోని ప్రతి పేదోడికి వారికి గౌరవప్రదంగా మంచి అన్నం పెట్టడమే అన్నా క్యాంటీన్ల ధ్యేయమని, పేదలకు కూడు, గూడు, గుడ్డ అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి డాక్టర్ పి.నారాయణ అన్నారు. ఈనెల 4న ఆయన గూడూరు పుర పాలకశాఖ ఆధ్వర్యంలో పిఎస్‌ఆర్ పార్కు వద్ద ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ క్యాంటిన్‌కు ప్రారంభోత్సవం చేసిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని 110 మున్సిపాలిటీల్లో 134 అన్నా క్యాంటిన్‌లు పేదలకు అందుబాటులో ఉన్నాయన్నారు. 135వ క్యాంటిన్‌కు గూడూరులో ఇప్పుడు ప్రారంభోత్సవం జరిగిందన్నారు. గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ కోరిక మేరకు గూడూరులో మరో అన్నా క్యాంటీన్ పెట్టేందుకు కృషి చేస్తామన్నారు.

## పేదలకు..

# సేవ చేయడం అభినందనీయం



వైద్యసేవలందిస్తున్న డాక్టర్ సి.రోహిణి

పేదలకు సేవ చేయడం ఎంతో అభినందనీయమైన విషయమని, వారికి ఉచితంగా వైద్య సేవలు నిర్వహించడం సంతోషకరమని ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి అన్నారు. గూడూరులోని షిర్డీసాయినగర్‌లో ఉన్న సాయిబాబా దేవాలయం ప్రాంగణంలో డాక్టర్ సిఆర్ రెడ్డి ఆసుపత్రివారి సహకారంతో ఇటీవల ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఆంధ్ర మహిళామండలి, ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్యశిబిరంలో రోగులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఇన్నర్‌వీల్‌క్లబ్ ప్రతినిధులు లక్ష్మి, స్నేహలతారెడ్డి పాల్గొన్నారు.

## వృద్ధులకు..

# లయన్స్‌క్లబ్ మంచాలు



వృద్ధులకు మంచాలు అందజేస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

గూడూరులోని ఓం చారిటీస్ వృద్ధాశ్రమంలో కృష్ణబాబు జ్ఞాపకార్థం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వృద్ధులకు మంచాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ వారు మాట్లాడుతూ వృద్ధులకు సేవచేయడం ఎంతో సంతోషకరమన్నారు. పెద్దలను గౌరవించుకోవడం భారతీయ సంప్రదాయమని, ప్రతి ఒక్కరూ తమవంతుగా వృద్ధాశ్రమాల్లోని వృద్ధులకు చేయూతను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు వాకాటి రామ్మోహన్‌రావు, రూపేష్‌రెడ్డి, రవిచంద్ర, కడివేటి చంద్రశేఖర్, సత్యనారాయణ, వరప్రసాద్, మధుమల్లిక తదితరులు పాల్గొన్నారు.

# అపస్మారక స్థితిలోకి ఎన్టీఆర్

శ్రీను గల్పిక

అది దేవేంద్ర లోకం రాజధాని అమరావతి. వీకెండ్ కల్చరల్ ఈవెంట్స్‌లో భాగంగా ఆరోజు ఐరావత్ కన్వెన్షన్‌హాల్‌లో డ్యాన్స్ ప్రోగ్రామ్ పెట్టారు. టంగుటూరు ప్రకాశం పంతులు, బెజవాడ గోపాలరెడ్డి, నీలం సంజీవరెడ్డి, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి, కాసు బ్రహ్మానందరెడ్డి, మర్రి చెన్నారెడ్డి, నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి, వై.యస్. రాజశేఖరరెడ్డి వంటి టాప్ విఐపిలు మాత్రమే ఆ హాల్‌లో వున్నారు. దేవేంద్రుడు వచ్చి జ్యోతిప్రజ్వలన చేసి సాంస్కృతిక కార్యక్రమాలను లాంఛనంగా ప్రారంభించారు. తొలుత స్టైల్ ఆఫ్ సింహపురి ఆనం వివేకా మేనకతో స్పెషల్ సాంగ్... "గున్నా గున్నా మామిడి" అనే పాటకు డ్యాన్స్ చేశాడు. తర్వాత ఎన్టీఆర్ వంతు వచ్చింది. ఆయన రంభతో కలిసి 'కొండవీటి సింహం'లోని "బంగినిపల్లి మామిడిపండు రంగు తేలింది, చిలకే కొట్టని జామపండు చేతికొచ్చింది" అనే పాటకు తన స్టైల్‌లో హావభావాలు ప్రదర్శిస్తూ డ్యాన్స్ చేస్తుండగా కోట్ల, నేదురుమల్లి, వై.యస్. తదితర ప్రేక్షకులు హుషారుగా చప్పట్లు కొడుతూ విజిల్స్ వేస్తున్నారు. అలా డ్యాన్స్ చేస్తుండగా ఎన్టీఆర్ సడెన్‌గా చేతులతో గుండె పట్టుకుని క్రింద పడిపోయాడు. ఇంద్రుడితో సహా అందరూ గాబరాపడ్డారు. వై.యస్. అయితే 'వనాట్ ఎయిట్' అంటూ కేకేసాడు. ఇంద్రుడు వుండి... ఇక్కడ ఇంకా 108లు పెట్టలేదు. ఎంతటి ప్రాణాపాయస్థితి వచ్చినా అమృతం అందుబాటులో వుంటుంది, ఇబ్బంది లేదు అని చెప్పాడు. అమృతం అంటే ఫారినా, లోకలా అని నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి అడిగాడు. ఫారిన్ ఏంటి? లోకల్ ఏంటి? అని ఇంద్రుడు అమాయకంగా అడిగాడు. అందుకు నేదురుమల్లి... అదేనబ్బా, విస్కీ... ఫారిన్ స్కాచా... మేడిన్ ఇండియానా... అని విడమర్చి చెప్పాడు. అది విని ఇంద్రుడు అలాంటి సురాపానాలు ఇక్కడ నిషేధం... అయినా మద్యపాన నిషేధం అమలు చేసిన ఆ మహానేతకు మద్యం తాగిస్తామా... మేము ఆయనకు ఒరిజినల్ అమృతమే తాగించి తిరిగి మామూలు మనిషిని చేస్తాము అని చెప్పి గంధర్వుల చేత ఒక బాటిల్‌లో అమృతం తెప్పించి ఎన్టీఆర్ చేత తాగించాడు. ఒక్క దెబ్బకు ఎన్టీఆర్ లేచి కూర్చున్నాడు. ఏమైంది మీకు అని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి అడిగాడు. అందుకు ఎన్టీఆర్... ఆంధ్రప్రదేశ్‌లో జరగరానిది ఏదో జరిగినట్లున్నది అందుకే నా గుండె గతుక్కుమన్నది అని అన్నాడు. అంతలో నారాయణ... నారాయణ... అంటూ ఇంటర్నేషనల్ మ్యాన్యువల్ మీడియా నారదుడు వచ్చాడు. రాగానే అక్కడ పరిస్థితిని గమనించి ఏమైంది అని అడిగాడు. ఇదీ జరిగింది అంటూ ఇంద్రుడు అక్కడ జరిగింది చెప్పాడు. అప్పుడు నారదుడు ఎన్టీఆర్‌తో... మీ అల్లుడు హైటెక్‌రత్న చంద్రబాబుపై మీ అభిప్రాయం అని అడిగాడు. దానికి ఎన్టీఆర్... నా అల్లుడికేం బంగారం. నన్ను దించి నా సీటును లాగేసుకున్నాడనే చిన్న బాధేగాని, మిగతా అన్ని విషయాలలో సమర్ధుడిగా వున్నాడు. తెలుగుదేశం ఆశయాలను కొనసాగిస్తున్నాడు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్నాడు. మా అల్లుడు వీరోచిత పోరాటం ఎలాంటిదో కావాలంటే ఈ వీడియోలో చూడండి అంటూ ఒక సి.డి తీసి నారదుడికిచ్చాడు. నారదుడు దానిని సి.డి డ్రైవ్‌లో పెట్టి ఆన్ చేసాడు. స్క్రీన్ మీద చంద్రబాబు ప్రత్యక్షం...

గుంటూరులోని ఓ కళాశాలలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో చంద్రబాబు ప్రసంగం. తమ్ముళ్ళూ... ఈ రాష్ట్రానికి అన్యాయం చేసింది కాంగ్రెస్... తెలుగుజాతిని నాశనం చేయాలని చూస్తున్నది కాంగ్రెస్... సోనియాగాంధీ ఓ ఇటలీ దెయ్యం... రాహుల్‌గాంధీ ఇండియా-ఇటలీ మిక్స్‌డ్ పిల్లరాక్షసుడు... ఈ కాంగ్రెస్‌ను దేశం నుండే తరిమికొట్టాలి. దేశంలో ఉగ్రవాదం పెరగడానికి కారణం కాంగ్రెస్. కాశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని పెంచి పోషించింది వాళ్ళే! అస్సాంలో ఉల్ఫా ఉగ్రవాదానికి పురుడు పోసింది ఆ పార్టీయే. పంజాబ్‌లో ఖలిస్థాన్ తీవ్రవాదానికి బీజాలు వేసింది కాంగ్రెస్సే... ఈ కాంగ్రెస్‌ను ఇండియా వదిలి ఇటలీకి తరిమికొట్టే వరకు నేను పచ్చిమంచినీళ్ళు కూడా ముట్టను అని శపథం చేశాడు. అప్పుడే ఓ కార్యకర్త గ్లాసులో ఒక పానీయం తెచ్చి తాగమని ఇచ్చాడు. నేను ఇప్పుడే కదా చెప్పాను, కాంగ్రెస్‌ను ఈ దేశం నుండి తరిమికొట్టే దాకా పచ్చి మంచినీళ్ళు కూడా ముట్టనని అని చంద్రబాబు సీరియస్‌గా అన్నాడు. అందుకు ఆ కార్యకర్త... అయ్యో పొరపడుతున్నారు సార్, ఇవి మంచినీళ్ళు కాదు, ఫ్రూట్‌జ్యూస్ అని చెప్పాడు. అట్లాగైతే ఓకే అంటూ చంద్రబాబు గుటగుటతాగేసాడు. అక్కడితో ఆ సీన్‌లు అయిపోయాయి.

అప్పుడు ఎన్టీఆర్ చెమర్చిన కళ్లతో... 1995లో నాకు వెన్నుపోటు పొడిచినప్పుడు నా అల్లుడిపై చెప్పలేనంత కోపమొచ్చింది. ఆ తర్వాత అతను కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా చేస్తున్న పోరాటం చూసి నాకు పొడిచిన వెన్నుపోటు కరెక్టేమోననిపించింది. ఎందుకంటే అతని స్థానంలో నేనున్నా కూడా కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఇంత సమర్ధవంతంగా పోరాడివుండేవాడిని కాదేమో అని అన్నాడు.

అప్పుడు నారదుడు... మీరు పార్ట్-1 చూపించారు. ఇప్పుడు పార్ట్-2 చూడండి అంటూ ఇంకో సి.డి.ని తీసి సిడి డ్రైవ్‌లో పెట్టి ఆన్ చేశాడు. స్క్రీన్ మీద సీన్‌లు మొదలయ్యాయి.

ఢిల్లీలోని టెన్‌జనపథ్. అప్పుడే అక్కడ కొన్ని కార్లు ఆగాయి. అందులో నుండి హైటెక్‌రత్న చంద్రబాబునాయుడు, ఎంపీలు సీఎం రమేష్, సుజనాచౌదరి, మాగంటి మురళీమోహన్, ఎన్.శివప్రసాద్, గల్లా జయదేవ్ తదితరులు దిగారు. నేరుగా లోపలకు వెళ్ళారు. కొద్దిసేపటి తర్వాత బయటకు వచ్చారు. వాళ్ళ పక్కన రాహుల్‌గాంధీ కూడా వున్నాడు. చంద్రబాబుతో సహా అందరి మెడల్లో పసుపు కండువాలతో పాటు కాంగ్రెస్ కండువాలు వున్నాయి. అప్పటికే అక్కడ మీడియావాళ్ళంతా పోగైవున్నారు. చంద్రబాబు మైకుల ముందుకొచ్చి... ఇదొక చారిత్రాత్మక ఘట్టం. మా ఈ కలయిక దేశ ప్రజలకు కానుక. జాతికి వేడుక. నరేంద్ర మోడీ నుండి దేశ ప్రజలను రక్షించడం కోసం కాంగ్రెస్‌తో కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నాం. ఈ దేశానికి కాంగ్రెస్సే భద్రత, భరోసా. జాతీయ స్థాయిలో కాంగ్రెస్‌ను మించిన పార్టీ లేదు. సోనియాగాంధీ ఓ ఇటలీ దేవత. ఆ తల్లి చల్లని చూపుతోనే ఈ దేశం సుభిక్షంగా వుంటుంది. కాంగ్రెస్‌తో నేను పొత్తు పెట్టుకోవడానికి మరో కారణం మా మామ, తెలుగు ప్రజల అన్న ఎన్టీఆర్... రాత్రి ఆయన నాకు కలలో కనిపించి... అల్లుడూ, ఆ నరేంద్ర మోడీ తెలుగు ప్రజలకు ద్రోహం చేశాడు. తెలుగు జాతి ఆత్మగౌరవం నిల బెట్టేలా నువ్వు కాంగ్రెస్‌తో కలిసి మోడీపై పోరాడు అని ఆయన కలలో ఏడుస్తూ చెప్పాడు. ఆయన కోరిక తీర్చడానికే తెల్లారేసరికల్లా ఢిల్లీ వచ్చి కాంగ్రెస్‌తో పొత్తు కుదుర్చుకున్నాను అని చెప్పి ముగించాడు.

స్క్రీన్ మీద సీన్‌లు ఆగిపోయాయి. ఇప్పుడు చెప్పండి మీ అల్లుడి గారి గురించి... కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఇంకా పోరాటం చేస్తున్నాడని నమ్ముతున్నారా... అంటూ నారదుడు ఎన్టీఆర్ భుజంపై చేయివేసి ఊపాడు. అప్పటికే ఆ దృశ్యాలు చూసి నిశ్చేష్టుడైన ఎన్టీఆర్ నారదుడి కుదుపుకు కుర్చీలో నుండి అలాగే కిందకు వాలిపోయాడు. చంద్రబాబు ఇచ్చిన షాక్‌తో ఈసారి ఎన్టీఆర్ కోలుకోలేని విధంగా స్ట్రోక్‌కు గురయ్యాడని వూహించిన వై.యస్. ఈసారి అమృతంతో లాభం లేదనుకుని 'అంబులెన్స్' అంటూ గట్టిగా అరిచాడు.

# పద్య సౌరభాలు గుబాళించే.. 'రోజుకో పద్యం-శంకరాభరణం'






**రోజుకో పద్యం - శంకరాభరణం**
వెల: రూ.150/- పేజీలు : 306
ప్రతులకు :
అవధాని కోట రాజశేఖర్
ఫ్లాట్ నెం.30, 3వ అడ్డరోడ్డు మొదటివీధి,
కె.ఆర్.ఆర్.నగర్, పడుగుపాడు, కోవూరు (మం.),
నెల్లూరు జిల్లా. సెల్. 9966236604

పద్య సౌరభాలు గుబాళించే..'రోజుకో పద్యం-శంకరాభరణం' గ్రంథం అవధాన కవి రాజశేఖర్ పద్యకవితా ప్రతిభకు ప్రతీకగా నిలిచిందంటే అతిశయోక్తి కాదు. తెలుగుభాషలో కవితా ప్రదర్శనకు అనేక ప్రక్రియలున్నాయి. వాటిలో అవధాన ప్రక్రియ ఒకటి. అప్పటికప్పుడే అడిగిన విషయాలను కవితా రూపంలో చెప్పడం(ఆశువు), చెప్పిన దానిని గుర్తుంచుకుని యథాతథంగా మళ్ళీ చెప్పడం(ధారణ), అప్రస్తుతమైన ప్రశ్నలకు చమత్కారంగా సమాధానాలు చెప్పడం (సమయస్ఫూర్తి) అవధానాలు చేసేవారికి అవసరం. అటువంటి అవధానవిద్యలో ఆరితేరిన వారు సరస కవితా విశారదులు, నిత్యసాహితీ కృషీవలులు.. విద్వాన్ శ్రీ కోట రాజశేఖర్.

వీరు నెల్లూరుజిల్లా అల్లూరులో గల శ్రీ రామకృష్ణా జూనియర్ కళాశాలలో సంస్కృతోపన్యాసకులుగా పనిచేసి పదవీ విరమణానంతరం కవితా వ్యాసంగంతో కాలం గడుపుతున్నారు. హైదరాబాద్ నివాసి శ్రీ కంది శంకరయ్యగారు వాట్సాప్ బ్లాగ్‌లో ప్రవేశపెట్టిన 'శంకరాభరణం' అనే శీర్షికతో నడుస్తున్న సమస్యా పూరణను గమనించి, అందులో తాను సభ్యుడిగా చేరి పద్యరచనా కార్యక్రమంలో శ్రీ రాజశేఖర్ భాగస్వాములైనారు. ప్రతిరోజూ వాట్సాప్‌ను వీక్షిస్తూ అందులో ఇచ్చిన సమస్యలు, దత్తపదులు మొదలైన అంశాలను పద్యాలుగా పూరిస్తూ ఏరోజుకారోజు వాటిని పంపుతూ, సహృదయులైన కవిపండితుల ప్రశంసలను అందుకుంటున్న సుకవి శ్రీ రాజశేఖర్. కేవలం సమస్యలేగాక, దత్తపదులు, నిషిద్ధాక్షరి వంటి అంశాలను కూడా పూరిస్తూ, స్వీయ కంఠంతో వీనులవిందుగా వినిపిస్తూ అందరికీ పద్య కవితా రసానందాన్ని కలిగిస్తున్నారాయన. ఆ విధంగా ప్రతిదినం పంపిన పద్య సముదాయాన్ని లబ్ధప్రతిష్ఠులైన కవిపండితుల ప్రశంసలతో జోడించి ఇటీవల అందమైన పద్య గ్రంథంగా ముద్రించారు. అదే 'రోజుకో పద్యం-శంకరాభరణం' అనే పద్యకదంబం. ఇది పద్య కవితాభిమానుల, సహృదయుల హస్త భూషణమై వారికి మనోవికాసాన్ని కలిగిస్తూ ఉంది. ఈ గ్రంథం వీణాపాణి అయిన శారదాదేవి వర్ణ ముఖచిత్రంతో ఆకర్షణీయంగా ఉంది. మొత్తం 362 పేజీలతో, సుప్రసిద్ధ పండితులు, అవధానుల దివ్య సందేశాలతో వెలువడింది. సుప్రసిద్ధ అవధానులు, 'హంస' అవార్డు గ్రహీత శ్రీ నరాల రామారెడ్డి, శతావధాని సూరం శ్రీనివాసులు, మహావధాని మేడసాని మోహన్ తదితరుల ప్రశంసలతో, పండితుల విశిష్టమైన అభిప్రాయాలతో పాఠకులకు ఈ గ్రంథం అవశ్య పఠనీయంగా ఉంది. శ్రీ కోట రాజశేఖర్ కవితా వైభవాన్ని.. సమయోచిత పద ప్రయోగరచనా నైపుణిని ఇందులో పండితులు సోదాహరణంగా వివరించారు. ప్రత్యేకించి వీరి గురువర్యులు, ప్రముఖ అవధాన కవి నరాల రామారెడ్డి వీరి పద్యాలను గూర్చి బాగా ప్రశంసించారు. రాజశేఖర్ పూరించిన సమస్యల్లో చాలావరకు చక్కనిశైలిలో అందమైన పద్యాలున్నాయని, దత్తపది నిర్వహణలో ఆయన చూపిన చాకచక్యం ఎంతో ఆనందం కలిగిస్తూ ఉందని అభినందించారు కూడా. ఈ గ్రంథంలో సమస్య, దత్తపది, నిషిద్ధాక్షరి, న్యస్తాక్షరి, ఛందోగోపనం వంటి అనేక ప్రక్రియలు అత్యద్భుతంగా పూరించబడ్డాయి. ఈ ప్రక్రియా నిర్వహణలో ఆయన చూపిన ప్రతిభా వ్యుత్పత్తులు, సమయోచిత పద ప్రయోగం, పురాణ కథా సమన్వయం ప్రశంసా పాత్రములు. సాధారణ పాఠకుల సౌకర్యార్థం వీరు ప్రతి పద్యానికి చివర సందర్భం, భావం విశదపరచడమే కాక, ఆయా సంస్కృత గ్రంథాల్లో గల సూక్తులను సందర్భోచితంగా ప్రస్తావించి అందరికీ విజ్ఞానాన్ని పంచిపెట్టారు.



గ్రంథ సమీక్ష
**డా. చీమకుర్తి వెంకటేశ్వరరావు**
**నెల్లూరు.**

**'పద్యము భావనామయము,**
**పద్యము సూక్తి సుధాలయమ్మునౌ**
**పద్యము రాగరంజితము**
**భారతి మెచ్చెడి భూషణమ్మునౌ**
**పద్యము భాషకే వరము**
**పండిత పామర రంజకమ్మునౌ**
**పద్యము లోకపూజితము పద్యము**
**హృద్యము శాశ్వతమ్మునౌ!...**

అంటూ ఈ గ్రంథంలో పద్యాన్ని గూర్చి హృద్యమైన పద్యం చెప్పారు శ్రీ రాజశేఖర్. అదేవిధంగా, 'దారము పైన వ్రాలెను గదా మకరందము గ్రోల తుమ్మెదల్' అనే సమస్యను ఈ కవి అత్యంత అందంగా 'మందారము పైన వ్రాలెను గదా' అన్నట్లుగా వర్ణించి పాఠకులకు ఆహ్లాదాన్ని కలిగించారు. ఇటువంటి ఉదాహరణలు ఈ గ్రంథంలో కొల్లలు. ఇంతేగాక, ఈ గ్రంథంలో 'చిత్రానికి పద్యం' అనే శీర్షికతో ఇతరులిచ్చిన మనోహరమైన చిత్రాలకు చక్కని పదబంధంతో పద్యాలు వ్రాసి అందరినీ మెప్పించారీయన. వీరి పద్యాల్లో కొన్నిటిని అవధాని చిటితోటి విజయకుమార్ శ్లోకాలుగా సంస్కృతీకరించారు. ఇదొక విశేషం. గద్వాల వాసి విద్వాన్ నాయుడు గారి జయన్నగారు కొన్ని పద్యాలను వీడియో చిత్రీకరణ చేసి యూ-ట్యూబ్‌లో ఉంచి, వీరి కవితా సౌందర్యానికి మెరుగు పెట్టడం మరొక విశేషం. ఈ గ్రంథం పండిత ప్రశంసలతో, ప్రతిరోజూ పూరింపబడిన అవధానాంశాలతో, తెలుగుభాషా వికాసంతో, అందమైన పలుకుబళ్ళతో, చమత్కార పద ప్రయోగాలతో, భావపుష్టితో ప్రకాశిస్తూ నేటి యువతరానికి మక్కువ కలిగిస్తూ పద్య రచనలో ఉండే మెలకువలను తెలుపుతూ అందరికీ జిజ్ఞాసను కలిగిస్తూ ఉంది. విద్వాంసులు, తెలుగు భాషాభిమానులైన వారందరూ ఈ గ్రంథాన్ని చదివి ఆనందించి తెలుగుభాషా వ్యాప్తికి తమవంతు కృషి చేయగలరని ఆశిస్తున్నాను.

# 'నుడా'లో అభివృద్ధి దీపావళి



- చైర్మెన్ శీనయ్య వెల్లడి

2019కల్లా నెల్లూరు నగరంలో అభివృద్ధి దీపావళిని చూస్తామంటున్నాడు నుడా చైర్మెన్ కోటంరెడ్డి శీనయ్య. 6వ తేదీ నెల్లూరులోని తన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం పెట్టాడు. నుడా పరిధిలో 70కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు చెప్పాడు. స్వర్ణాలచెరువు వద్ద నెక్లెస్‌రోడ్డు, ఇరుకళలమ్మ గుడి వద్ద ఘాట్ నిర్మాణం, బారా షహీద్ దర్గా, నీలగిరి సంఘం, ఇరుకళలమ్మ దేవస్థానాల వద్ద ఆకర్షణీయమైన స్వాగతద్వారాలు, ట్యాంక్‌బండ్‌లా నిర్మించే నెల్లూరు చెరువుగట్టుపై వాకింగ్ ట్రాక్, సైకిల్ ట్రాక్, పార్కు, మాగుంట లే అవుట్‌లో స్పోర్ట్స్ క్లబ్, థీమ్‌పార్క్... రేపు సంక్రాంతి పండక్కి ఇవన్నీ నగర ప్రజలకు కానుకగా అందించబోతున్నామన్నారు. కావలి, గూడూరు, సూళ్ళూరుపేట, కోవూరు, ముత్తుకూరు పట్టణాలలో కూడా పార్కులను అభివృద్ధి చేయనున్నట్లు శీనయ్య చెప్పాడు.

### జనం గుండెల్లో జనసేనంటూ..

# నినదించిన 'మనుక్రాంత్'



జనం కోసం తపిస్తున్న 'జనసేన' అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ నాయకత్వాన్ని బలపరుద్దాం అంటూ జనసేన పార్టీ జిల్లా నాయకుడు మనుక్రాంత్‌రెడ్డి నగరంలో భారీ ర్యాలీ నిర్వహించాడు. 'జనంలోకి జనసేన', 'జనం గుండెల్లోకి జనసేన', 'జనంతోనే జనసేన' అనే నినాదాలతో నెల్లూరు మినీబైపాస్‌రోడ్డులోని ఆయన కార్యాలయం నుండి అధిక సంఖ్యలో మహిళలు, విద్యార్థినులు, రైతులతో భారీ ప్రదర్శన నిర్వహించాడు. మన నగరానికి ఏమైంది, కాలుష్యం కోరల్లో నలుగుతోంది అంటూ నాయకుల్లో చిత్తశుద్ధి కరువైందని, రైతులు అల్లాడుతున్నారని, మహిళలు నిరాదరణకు గురౌతున్నారని మనుక్రాంత్ తీవ్రస్థాయిలో ప్రభుత్వ పెద్దలపై ధ్వజమెత్తాడు. రాష్ట్రం బాగుపడాలంటే అన్ని రంగాల్లో ముందుకు సాగాలంటే 'జనసేన' పార్టీని ఆదరించడమే మంచి పరిష్కారమని సూచించారు. పవన్‌కళ్యాణ్ నాయకత్వంలో యువతరం అభివృద్ధిపథంలో దూసుకుపోతుందని, మహిళా శక్తికి అన్ని రంగాల్లో ప్రాధాన్యత కల్పించబడుతుందని, రైతన్నల కష్టాలు పూర్తిగా తీరిపోతాయని భరోసా ఇస్తు 'జనసేన'ని బలపరచండంటూ పిలుపునిచ్చాడు. ఆయనతో పాటు పార్టీ సభ్యులు సతీష్, వెంకటేశ్వర్లు, రాము, కిషోర్, శ్యాం, ప్రవీణ్, నవీన్, రాజేశ్వరమ్మ, నాగరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

### శ్రీసిటీ రవిరెడ్డి..

# స్త్రీశక్తికి పెద్దపీట వేస్తున్నాడు

- దేశంలోని 100 ఉత్తమ కంపెనీల్లో 2 ఇక్కడివే
- ఆ కంపెనీలకు ప్రతిష్టాత్మక పురస్కారాలు




శ్రీసిటీలోని క్యాడ్బరీ (మాండెలెజ్), కెలాగ్స్ పరిశ్రమలు 'దేశంలో మహిళలకు ఉత్తమమైన కంపెనీల జాబితా'లో చేరి ప్రతిష్టాత్మక అవార్డులను అందుకోవడం శ్రీసిటీకే కాక, సింహపురి సీమకే గర్వకారణం. చెన్నైకి చెందిన అవతార్ గ్రూప్, అమెరికాకు చెందిన 'వర్కింగ్ మదర్ ఇండియా' సంస్థతో కలసి చేపట్టిన '100 బెస్ట్ కంపెనీస్ ఫర్ ఉమెన్ ఇన్ ఇండియా-2018' (బిసిడబ్ల్యు-2018) సర్వేలో ఈ రెండు కంపెనీలు ఎంపికయ్యాయి. ఇటీవల చెన్నైలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆ కంపెనీ ప్రతినిధులకు ఈ పురస్కారాలను అందజేశారు. ఇది శ్రీసిటీ ఎంతో గర్వించదగిన అంశమని శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్రసన్నారెడ్డి అన్నాడు. శ్రీసిటీలోని వివిధ పరిశ్రమల్లో సుమారు 35వేల మందికి పైగా ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి దొరుకుతోందని, వారిలో సగం మంది మహిళలేనని, మహిళలకు ఆర్థిక స్వావలంబన లభిస్తే వారి కుటుంబ స్థితిగతులు మెరుగై పిల్లల భవిష్యత్ కూడా బావుంటుందనే తలంపుతో వారికి ఇక్కడ అధికసంఖ్యలో ఉద్యోగాలు ఇవ్వడం జరుగుతోందని రవిరెడ్డి చెప్పాడు. ఒక్క ఫాక్స్‌కాన్‌కు చెందిన రైజింగ్‌స్టార్ పరిశ్రమలోనే సుమారు 15వేల మందికిపైగా మహిళలు పనిచేస్తుండగా, మిగిలినవారు మాండెలెజ్ (క్యాడ్బరీ), కెలాగ్స్, ఎంఎస్ఆర్ గార్మెంట్స్, పాల్స్ ప్లష్, ఎవర్టన్ టీ, కాల్గేట్ పామోలివ్, యూనీఛాం, పెప్సికో తదితర పరిశ్రమల్లో పనిచేస్తున్నారని రవిరెడ్డి గర్వంగా చెప్పాడు.

### • ముత్యాలరాజు సాధించాడు...

# మువ్వాను సాగనంపాడు



మార్టిన్, సింధుల మధ్య బ్యాడ్మింటన్ పోటీ జరుగుతుంటుంది... పాయింట్ల వేటలో ఆధిపత్యం క్షణాల కాలంలో అటు ఇటు మారుతుంటుంది. ఇలాంటి టెన్షన్ కుర్చీ గేమే మూడునెలలుగా జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు, వివాదాల విద్యాశాఖాధికారి మువ్వా రామలింగం మధ్య జరిగింది. జిల్లా డిఇఓగా, బిఇడి కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేసి జిల్లాలో లెక్కలేనన్ని వివాదాలను నెత్తిన పెట్టుకున్న మువ్వా రామలింగంను ఈ జిల్లా నుండి తరిమేయగా, మళ్ళీ ఆయన విద్యాశాఖ మంత్రి వద్ద తనకున్న పలుకుబడితో పల్లిపాడులోని డైట్ కళాశాల ప్రిన్సిపాల్ పోస్టు తెచ్చుకున్నాడు. ఇతనికున్న ట్రాక్ రికార్డు తెలుసు కాబట్టి కలెక్టర్ ముత్యాలరాజు అతనిని ప్రిన్సిపాల్ పోస్టులో కూర్చోవద్దని చెప్పాడు. అతను లెక్కచేయకుండా ప్రిన్సిపాల్‌గా ఛార్జ్ తీసుకున్నాడు. కలెక్టర్ మళ్ళీ రామలింగాన్ని ప్రభుత్వానికి సరెండర్ చేస్తున్నట్లు ఉత్తర్వులిచ్చి, డైట్ ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్‌గా వెంకటేశ్వర్లును నియమించారు. కాని మువ్వా, కలెక్టర్ ఆదేశాలను పట్టించుకోకుండా కొన్ని రోజులు కాలేజీకొచ్చి ప్రిన్సిపాల్ సీట్లో కూర్చున్నాడు. మరోపక్క ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్‌గా వెంకటేశ్వర్లు కూడా ఉండేవాడు. కొద్దిరోజులు కాలేజీకి ఇద్దరు ప్రిన్సిపాళ్ళ వ్యవహారం నడిచింది. ఈలోపు మువ్వా రామలింగం ప్రిన్సిపాల్‌గా తననే కొనసాగించేలా విద్యాశాఖ కార్యదర్శి నుండి ఆర్డర్స్ తెచ్చుకున్నాడు. కలెక్టర్ దానిని లెక్కలోకి తీసుకోలేదు. మువ్వాను ఎట్టి పరిస్థితుల్లోనూ జిల్లాలో ఉండనీయ కూడదనుకున్నాడు. ఆయన ఏ స్థాయిలో పట్టుబట్టాడో ఏమో గాని... విద్యా శాఖ నుండి మువ్వాకు సంకేతాలొచ్చాయి... డైట్ కాలేజీ ప్రిన్సిపాల్ కుర్చీని వదిలేసి వచ్చి అమరావతిలో రిపోర్టు చేయమని. మొన్న 6వ తేదీ మువ్వా రిలీవ్ అయ్యాడు. జిల్లా విద్యాశాఖలో వున్న సిబ్బంది, టీచర్లు రిలీఫ్‌గా ఫీలయ్యారు.

### జాతీయ పోటీలకు

# రెయిన్ బో విద్యార్థులు



ముంబయిలో ఈనెల 15 నుంచి జరిగే జాతీయ సిలంబమ్(ప్రాచీన యుద్ధ కళలు) పోటీలకు రెయిన్ బో సీబీయస్‌ఇ పాఠశాల విద్యార్థులు 9 మంది ఎంపిక య్యారని పాఠశాల డైరెక్టర్ పద్మా సుబ్రహ్మణ్యం తెలిపాడు. కడపలో జరిగిన 4వ రాష్ట్రస్థాయి పోటీల్లో పాఠశాల విద్యార్థులు అండర్-14 విభాగంలో కె.సంజయ్‌కృష్ణ, ఎం.లీలామహాలక్ష్మీ, ఎం.గ్రీష్మలు, అండర్-17లో టి.జయంత్, హేమేష్ రత్న, శివ శిరీష, ఆర్ మేఘన, కె.శ్రీహిత, సిహెచ్. సిరిమల్లిలు బంగారు, వెండి పతకాలు సాధించారన్నారు. క్రీడాకారులను ప్రిన్సిపల్ రామగిరి విద్యాసాగర్, సిబ్బంది అభినందించారు.

### డా.కిషోర్స్ రత్నం స్కూల్లో..

# ఆహ్లాదంగా '5 వసంతాల సంస్కృతి'



నెల్లూరులోని డా.కిషోర్స్ రత్నం స్కూల్ ఆధ్వర్యంలో ఇటీవల అయిదు వసంతాల సంస్కృతి కార్యక్రమం ఎంతో ఆహ్లాదంగా జరిగింది. ఈనెల 2, 3 తేదీల్లో నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో ఎంతో సందడిగా జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి నారాయణ ఓయస్‌డి పెంచలరెడ్డి ముఖ్య అతిథిగా వచ్చి మాట్లాడుతూ, తెలుగు భాష ప్రాముఖ్యతను గురించి తెలుసుకునేందుకు, మన సంస్కృతిని కాపాడుకునేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమంటూ పాఠశాల నిర్వాహకులను అభినందించారు. పాఠశాల డైరెక్టరైన కృష్ణకిషోర్-వాసంతి కిషోర్‌లు మాట్లాడుతూ, భారతీయ సంప్రదాయ సిద్ధమైన శాస్త్రీయ నృత్యంలో విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించేందుకు వారికి ఈ వేదిక బాగా ఉపయోగపడుతుందని, గత అయిదేళ్ళగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు ఈ సందర్భంగా గణేశ స్తుతి, ఓం నమఃశివాయ, మహిషాసురమర్దిని తదితర పాటలకు అత్యద్భుతంగా నృత్యాభినయం చేసి అందరి ప్రశంసలు అందుకున్నారు. అనంతరం, శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించిన విద్యార్థినీ విద్యార్థులను, వారి తల్లిదండ్రులను పాఠశాల నిర్వాహకులు అభినందించారు. డా. కిషోర్ రత్నం జన్‌నెక్స్ట్ స్కూల్ జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, సీనియర్ మేనేజర్ రాజేష్, జూనియర్ మేనేజర్ అజయ్‌సింగ్, డా.కిషోర్ రత్నం నెల్లూరు, కావలి స్కూల్స్ విద్యార్థులంతా పాల్గొన్నారు.

### పండుగల ప్రాధాన్యతను వినూత్నరీతిలో..

# నేటి తరానికి తెలియజేస్తున్న స్కూళ్ళు



మన పండుగలు, సంప్రదాయాలను వాటి విశిష్టతలను నేటి తరానికి తెలియజెప్పి మన భారతీయ సంప్రదాయాలను పదికాలాల పాటు అందరూ గుర్తుంచుకునేలా చేయడం ఒక మంచి కార్యక్రమం. నెల్లూరులోని పలు స్కూళ్ళు వినూత్న రీతిలో పండుగల ప్రాధాన్యతను చిన్నారులకు, విద్యార్థులకు చాటిచెప్పడం ఎంతైనా అభినందనీయం. నెల్లూరు, మాగుంట లేఅవుట్ లోని వేదవ్యాస స్కూల్‌లో దీపావళి పండుగను పురస్కరించుకుని పాఠశాల నిర్వాహకులు 'గ్రీన్ దివాళీ', 'నరకాసుర వధ' నాటకాలను విద్యార్థులచేత ప్రదర్శింపజేశారు. కిండర్ గార్డెన్ విద్యార్థులు శ్రీకృష్ణుడు, సత్యభామ వేషధారణలతో అందరిని అలరించారు. ఈ కార్యక్రమాలు అటు చిన్నారులనే కాక, పెద్దవారిని కూడా బాగా ఆకట్టుకున్నాయి. కరెస్పాండెంట్ ఎపి బాలాజీ తదితరుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు విద్యార్థుల ఆనందోత్సాహాల మధ్య వేడుకగా జరిగాయి.

**మైథిలిస్కూల్‌లో..**

నెల్లూరు, చంద్రమౌళినగర్‌లో ఉన్న మైథిలి స్కూల్‌లో ఉపాధ్యాయులు విద్యార్థులకు దీపావళి పండుగ విశిష్టతను తెలియజేశారు. దుష్టత్వంపై మంచితనం సాధించిన విజయానికి ప్రతీకగా అన్నివర్గాల వారు ఎంతో ఆనందంగా జరుపుకునే పండుగ దీపావళి అన్నారు. ఆ తర్వాత మహిషాసురుని దిష్టి బొమ్మను టపాసులతో కాల్చి వేడుక జరుపుకున్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన 'మహిషాసురమర్దిని' నృత్యరూపకం అందరినీ ఆకట్టుకుంది. పాఠశాల కరెస్పాండెంట్ మైథిలి మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# నీళ్ళను పొదుపుగా వాడుదాం

## • ఐఏబి సమావేశంలో నిర్ణయం



ఈ నెల 8వ తేదీన జిల్లా సాగునీటి సలహామండలి సమావేశం నెల్లూరు కలెక్టరేట్‌లోని గోల్డెన్‌జూబ్లీ హాల్‌లో జరిగింది. జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి ఎన్.అమర్‌నాథ్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, కలెక్టర్ ముత్యాలరాజు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, మేకపాటి గౌతమ్‌రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ, బొల్లినేని రామారావు, పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, పాశం సునీల్‌కుమార్, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులున్నాయని, సోమశిలలో 42టిఎంసీలే అందుబాటులో వున్న దృష్ట్యా నీటి ఆవిరి, డెడ్ స్టోరేజ్ పోను 37 టీఎంసీలను వినియోగించుకునే అవకాశముంటుందని మంత్రి సోమిరెడ్డి వెల్లడించారు. ఈ నేపథ్యంలో జిల్లాలో 3లక్షల 21వేల ఎకరాల మొదటి పంటకు నీళ్ళివ్వాలని నిర్ణయించారు. 9వ తేదీ నుండే నీటిని విడుదల చేయాలని తీర్మానించారు. నీటి పొదుపుపై రైతులు శ్రద్ధ చూపాలని సోమిరెడ్డి కోరగా, నీటి పంపిణీలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ అధికారులను హెచ్చరించారు. సమావేశంలో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఇరిగేషన్ డ్రైన్స్‌ను నిబంధనల



ప్రకారం నిర్మించాలంటూ మధ్యలో భైఠాయించారు. దీనిపై కమిటీ వేసి పరిష్కరిస్తామన్న కలెక్టర్ హామీతో ఆయన లేచారు. దామాషా ప్రకారం గూడూరు డివిజన్‌కు నీటి కేటాయింపులు జరపాలని గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి ఎమ్మెల్యేలు కోరారు.

# సైకిల్ ఎక్కనున్న రాఘవ

(మొదటి పేజీ తరువాయి)

లెక్కకుమించి మలుపులు రావచ్చు. ఇలాంటి మలుపులే జిల్లా పరిషత్ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి రాజకీయ జీవితంలో చోటుచేసుకుంటున్నాయి.

ఆత్మకూరు శాసనసభ నుండి ఎక్కువ సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ప్రజానాయకుడు, ప్రజావైద్యుడు డాక్టర్ బి.సుందర రామిరెడ్డి కొడుకే రాఘవేంద్రరెడ్డి. సుందర రామిరెడ్డి రాజకీయం మొదలు పెట్టింది, ముగించింది కాంగ్రెస్‌లోనే! ఆయన రాజకీయ జీవితంలో మలుపులు లేవు. కాని, రాఘవకు అలాంటి మార్గం ఏర్పడలేదు. 2005లో ఏఎస్‌పేట జడ్పీటీసీగా కాంగ్రెస్ నుండే ప్రయాణం మొదలుపెట్టాడు. 2008లో జరిగిన స్థానిక శాసనమండలి ఎన్నికల్లో ఆయన రాజకీయ జీవితంలో మరో మలుపు చోటుచేసుకుంది. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ తిరుగుబాటు అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి సి.వి.శేషారెడ్డి పైనే విజయం సాధించాడు. ఆ తర్వాత తనను ఎమ్మెల్సీగా గెలిపించడంలో సహకరించిన తెలుగుదేశంకు అనుకూలంగా వ్యవహరించినప్పటికీ, ఆ సమయంలోనే మెగాస్టార్ చిరంజీవి ప్రజారాజ్యం పార్టీని పెట్టడంతో ఆ పార్టీలో చేరాడు. 2009 ఎన్నికల తర్వాత చిరంజీవి ప్రజారాజ్యాన్ని కాంగ్రెస్‌లో విలీనం చేశాడు. కాని, అంతకంటే ముందే రాఘవ కాంగ్రెస్‌కు చేరువయ్యాడు. వై.యస్. మరణానంతరం జగన్ స్థాపించిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిన రాఘవ, 2014లో జరిగిన జడ్పీ ఎన్నికల్లో ఉత్కంఠ పరిణామాల మధ్య జడ్పీ ఛైర్మెన్‌గా ఎన్నికయ్యాడు. ఓపక్క జడ్పీ ఛైర్మెన్‌గా వుంటూనే మరోపక్క వెంకటగిరి నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్‌గా కూడా బాధ్యతలు నిర్వర్తిస్తూ వచ్చాడు. 2019లో వెంకటగిరి వైసిపి టిక్కెట్ నాదే అనుకున్న రాఘవకు మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డి రూపంలో మొండి చేయి ఎదురైంది. టీడీపీ నుండి వైసిపిలో చేరిన రామనారాయణరెడ్డికి వెంకటగిరి వైసిపి ఇన్‌ఛార్జ్ బాధ్యతలు అప్పగించడంతో రాఘవకు తల కొట్టేసినంతపనైంది. దీనిని పరాభవంగా భావించిన ఆయన ఇటీవలే వైసిపికి రాజీనామా చేశాడు. కేవలం 13ఏళ్ళ రాజకీయ జీవితంలో రాఘవకు ఇన్ని మలుపులొచ్చాయి.

కాగా, ఇప్పుడు మరో పెద్దమలుపు తిరిగింది ఆయన రాజకీయ జీవితం. ఆయన తెలుగుదేశం పార్టీలో చేరడానికి రంగం సిద్ధమైంది. ఈ నెల 6వ తేదీన అమరావతిలో సీఎం చంద్రబాబుతో రాఘవ దాదాపు 20నిముషాలు భేటీ అయ్యాడు. పార్టీలో రాఘవ రాజకీయ భవిష్యత్‌కు చంద్రబాబు పూర్తి హామీ ఇచ్చాడు. చంద్రబాబు కూడా రాఘవను వచ్చే ఎన్నికల్లో పూర్తిస్థాయిలో వాడుకోవాలని, ప్రత్యక్ష ఎన్నికల్లో ఆయనను దించాలని ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది.

ఆత్మకూరు టీడీపీ అభ్యర్థిగా ప్రస్తుతం బొల్లినేని కృష్ణయ్యను రంగంలో దించి వున్నారు. కృష్ణయ్య ఆసక్తితో రాలేదు. చంద్రబాబు, ఆదాల ప్రభాకర్‌రెడ్డి వంటి నాయకుల బలవంతం మీద వచ్చినవాడే! ఆయన రాజకీయ పునరాగమనం కుటుంబ సభ్యులకు కూడా ఇష్టం లేదు. అయితే ఇప్పుడు రాఘవ రూపంలో ఆత్మకూరు నుండి కృష్ణయ్యకు ప్రత్యామ్నాయం వుంది. కాబట్టి టీడీపీలో అందరు కూడా రాఘవనే అభ్యర్థిగా సమర్థిస్తున్నట్లు తెలుస్తోంది. ఆత్మకూరులో టీడీపీకి 'రెడ్డి' అభ్యర్థి కావాలన్నది మొదటి నుండి వినిపిస్తున్న అభిప్రాయం. ఈ ప్రకారమే ఆత్మకూరుకు భవిష్యత్‌లో రాఘవే అభ్యర్థి కానున్నాడని సమాచారం.

ఆత్మకూరు టీడీపీ అభ్యర్థిగా రాఘవ దిగితే వైసిపి అభ్యర్థులలోనూ మార్పులు చోటుచేసుకునే అవకాశాలున్నాయి. రాఘవ పోటీకి దిగితే వైసిపి అభ్యర్థిగా మేకపాటి గౌతమ్‌రెడ్డి విజయావకాశాలు సన్నగిల్లుతాయి. అందుకని వెంకటగిరికి అనుకున్న ఆనం రామనారాయణరెడ్డిని ఆత్మకూరుకు తెచ్చి, వెంకటగిరిలో గట్టి వర్గమున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అక్కడ వైసిపి అభ్యర్థిగా నిలబెట్టే అవకాశాలు లేకపోలేదు. మొత్తానికి రాఘవ టీడీపీలో చేరిక ప్రభావం వెంకటగిరి, ఆత్మకూరులపై బలంగానే పడబోతోంది.

# నేస్తమా? భస్మాసుర హస్తమా?

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటికే బాబు అనుచరులపై ఏపిలో ఐటి దాడులు జరుగుతున్నాయి. చంద్రబాబు ప్రభుత్వ అవినీతి, అక్రమాల చిట్టా కేంద్రం వద్ద వుంది. ఓటు-నోటు కేసు మళ్ళీ రన్నింగ్‌లోకి వచ్చింది. ఏ ఒక్క అంశం మీద సిబిఐ ఎంక్వయిరీ జరిగినా చంద్రబాబు 40ఏళ్ళ ఇండస్ట్రీ కథాకమామిషు అంతా మటాష్.!

## మోడీని భయపెట్టడానికా?

చంద్రబాబు తలచుకుంటే జాతీయ స్థాయిలో అన్ని పక్షాలను ఏకం చేయగలడు. బీజేపీని ఓడించగలడు! ఆయనతో పెట్టుకోవద్దు... గతంలోనే ఆయనకు ఆ రికార్డు వుంది... అని చెప్పే ప్రయత్నంలో భాగంగానే ఆయన కాంగ్రెస్‌తో కలిసాడన్నది సూచాయగా తెలుస్తోంది. బాబు జోలికి వస్తే పరిణామాలు తీవ్రంగా వుంటాయని మోడీకి చేసిన హెచ్చరిక బాబూ - రాహుల్ కలయిక. ఇక్కడ చంద్రబాబు గమనించాల్సిన విషయం ఏంటంటే... ఆల్‌రెడీ బీజేపీకి వ్యతిరేకంగా యూపిఏ వుంది. బీజేపీని వ్యతిరేకించే పక్షాలన్నీ అందలో భాగస్వాములే! కాంగ్రెస్‌తో, బీజేపీతో కలవని కొన్ని పార్టీలు తటస్థంగానే వున్నాయి. చంద్రబాబు కాంగ్రెస్‌తో కలిసాడని చెప్పి వాళ్ళు కూడా కాంగ్రెస్ నీడన చేరే అవకాశాలు లేవు. జాతీయ రాజకీయాలలో పెనుమార్పులు అంటూ పచ్చమీడియా కొన్ని రోజులుగా ఊదరకొడుతోంది. అలాంటి పెనుమార్పులేమీ అక్కడ లేవు. ఎన్డీఏ నుండి బయటకొచ్చిన తెలుగుదేశం కాంగ్రెస్ గూటికి చేరిందంతే! ఈ పరిణామం వల్ల కాంగ్రెస్‌కు ఊహించని స్నేహితుడు దొరికినట్లే! కాని, చంద్రబాబుకే... కాంగ్రెస్ హస్తం అభయహస్తమా? లేక భస్మాసుర హస్తమా? అన్నది వచ్చే ఎన్నికలు తేల్చాలి!?

# సాహస పోరాటమే!

(మొదటి పేజీ తరువాయి)

20ఏళ్ళుగా జరుగుతూనే వుంది. ఆయన పోటీచేసిందీ లేదు... పెట్టిందీ లేదు. అయితే 2014 ఎన్నికల్లో మాత్రం తెలుగుదేశం పార్టీ తరపున కీలక బాధ్యతలు నిర్వర్తించాడు. తెలుగుదేశం అధికారంలోకి వచ్చాక ఓ దశలో ఆయన ఉపముఖ్యమంత్రి అవుతాడనుకున్నారు. సమీకరణల మూలంగా మంత్రి పదవితో సరిపెట్టుకున్నాడు.

తెలుగుదేశం పార్టీ అధికారంలో వుంటే ఆయనకు ఎమ్మెల్సీ కావాలంటే ఎమ్మెల్సీ వస్తుంది... మంత్రి కావాలనుకుంటే మంత్రి అవుతాడు. అసలు స్టేట్ వద్దనుకుంటే రాజ్యసభకు పంపుతారు. చంద్రబాబు వద్ద నారాయణకు అంత పరపతి వుంది. ఇన్ని అవకాశాలు పెట్టుకుని ఏరోజూ ప్రత్యక్ష రాజకీయాలతో గాని, ప్రజలతోగాని సంబంధాలు లేని నారాయణ ఒక్కసారిగా శాసనసభ సమరంలోకి దిగుతాడా? ఇదే మిలియన్ డాలర్ల ప్రశ్న? వాస్తవానికి అయితే అసెంబ్లీకి పోటీ చేసి గెలిచి శాసనసభకు పోవాల్సిన అవసరం ఆయనకు లేదు. కాకపోతే ఇప్పుడు నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి కోరిక మేరకో, లేదంటే చంద్రబాబు ఆదేశాల మేరకో ఆయన నెల్లూరు నగర అసెంబ్లీ నుండి పోటీకి సిద్ధమవుతున్నట్లు వార్తలొస్తున్నాయి. నగరం నుండి ఆయన పోటీకి దిగడం అంటే ఒక రకంగా సాహసమే!

ఇప్పటివరకు నారాయణ ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయలేదు. నారాయణ విద్యాసంస్థల అధినేతగా జాతీయ స్థాయిలోనే ఆయనకు ఒక ఇమేజ్ వుంది. నారాయణను బయట జిల్లాల్లో సైతం ఎంతో గొప్పగా వూహించుకుంటారు. అలాంటి నారాయణ నెల్లూరు అసెంబ్లీకి పోటీ చేస్తే సులభంగా గెలుస్తాడని ఎవరైనా అనుకుంటారు. ఇప్పుడు నెల్లూరులో చూస్తే అంత సులభతరమైన పరిస్థితి లేదు. వైసిపి సిటింగ్ ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్ ఎంతో స్ట్రాంగ్‌గా వున్నాడు. అతనిపై వ్యతిరేకత లేదు. గత తొమ్మిదిన్నరేళ్ళుగా నెల్లూరు నగర ప్రజల మధ్యే గిరికీలు కొడుతున్నాడు. దీనికితోడు ప్రజల్లో తెలుగుదేశం ప్రభుత్వం పట్ల తీవ్ర వ్యతిరేకత వుంది. జగన్ పట్ల ఆదరణ పెరుగుతోంది. నారాయణకు కులం, ఆర్థికం... ఈ రెండే అదనపు బలం. మిగతా అంశాలన్నీ బలహీనతలే! 1994లో అంతటి మాగుంటోళ్ళే ప్రభుత్వ వ్యతిరేకత వల్ల గెలవలేకపోయారు. అప్పుడు మాగుంట ప్రతినిధిగా కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన పి.వి.ప్రసన్నరెడ్డి టీడీపీ అభ్యర్థి రమేష్‌రెడ్డి చేతిలో ఓడిపోవడం చూసాం. నెల్లూరులో మాగుంట వాళ్ళంటే ఎంతో పేరు. అప్పట్లో వాళ్ళ సాయం పొందనిది ఎవరు? కళ్యాణి ఫిలింస్‌లో ఎప్పుడూ జనాలుండేవాళ్ళు. ఎవరు వచ్చి ఆర్థిక ఇబ్బందులు చెప్పుకున్నా ఎంతోకొంత సాయం చేసి పంపిస్తుండే వాళ్ళు. అంతలా దానధర్మాలు చేసిన వాళ్ళే ప్రభుత్వ వ్యతిరేకత గాలిలో ఓడిపోయారు. 2019లో తెలుగుదేశం వ్యతిరేక ప్రభావం వుండనే వుంటుంది. మరి దాని ముందు నారాయణ కుల, కరెన్సీ బలం తట్టుకుంటుందా? అన్నీ తట్టుకుని గెలిస్తే నారాయణను పెద్ద తోపే అంటారు. ఓడితే మాత్రం ఓస్... నారాయణ సీన్ ఇంతేనా అని కూడా అంటారు.

# మా మొలగొలుకులు

నెల్లూరు సీమ మట్టిలో
ఏ తియ్యందనాలు ఉబికి వెల్లువలై
మొలగొలుకులరై మొలకెత్తాయో ఏమో కానీ
సత్తువనిచ్చే వరిపైరు మొలగొలుకులు!
నెల్లూరు తీపి జ్ఞాపకం మొలగొలుకులు
మొలగొలుకు వెన్నులతో
మాగాళ్ళలో రాజసం ఉట్టిపడేది
నెల్లూరు మొలగొలుకులకు
మనిషిని మైమరపించే గుణం ఉండేది
ధైర్యాన్ని నింపే గొప్ప సుగుణం ఉండేది
పెన్నమ్మ నీటి మహిమ ఏపాటిదో
తెలియదు కానీ
మొలగొలుక్కు తీపిని తెచ్చిపెట్టింది
మొలగొలుకుల అన్నాన్ని
నెల్లూరు చేపల పులుసుతో కలిపి తింటే
స్వర్గమే భువిపై నాట్యం చేసేది
నెల్లూరు మొలగొలుకులకు
తెలుగువారి గోంగూర పట్టిస్తే
ఆ రుచి చెప్పనలివయ్యేది కాదు
పంటచేలు కల్లాంలో తిరిపెంగ ఇచ్చే
మొలగొలుకులు బిచ్చగాళ్లపాలిట
సంక్రాంతులయ్యేవి!
మళ్ళీ మొలగొలుకుల పంట విస్తరిస్తే
సన్నాలు సన్నబడిపోతాయి
నెంబర్లు నెంబర్లాట ఆడేస్తాయి
నెల్లూరు 'పైరు'గాలికి ఏ సృజన తేమ
తగిలిందో ఏమో కానీ తిక్కన చేత
మహాభారతాన్ని తెనిగింపజేశాయి
అమరజీవి గుండెల్లో త్యాగం నింపి
ఆంధ్రరాష్ట్రానికి బాటలు వేశాయి
ఓ జానెడు వెన్ను వరిపై ఊరేగినట్లు
ఊగుతుంటే
నెల్లూరు పెద్దారెడ్డి కోడలేమో
డాబు చూపించినట్టు బడాయిపోయేది మొలగొలుకు
మరో వెన్ను పచ్చపచ్చగా పైకివస్తుంటే
రైతు కుటుంబాలు మమతల మాగాణులయ్యేవి
నెల్లూరుకూ మొలగొలుక్కు
అనుబంధం ఇప్పటిదా?..
బండ్లమీద బస్తాలై మొలగొలుకులు
కులుకుతూ ఇంటికి వస్తుంటే
ధాన్యలక్ష్మి నడచివస్తున్నట్లుండేది
నేలతల్లి స్తన్యంలో తీపిని మొలగొలుకు
గ్రోలిందేమో ఆ అద్భుతరుచి
అంగిట్లోకి జారి అమృతాన్ని అందించే మొలగొలుకు
రండి మళ్ళీ మనం మొలగొలుకులవుదాం
చక్కగా కాసిన మాగాణులవుదాం
మొలకెత్తే కలుపును పీకేసి
స్వచ్ఛ నెల్లూరుకు బాటలు వేద్దాం!

- చిన్ని నారాయణరావు
9440202942



VPR GROUP

Proudly presents
a world class living destination

VPR SHANTINIKETAN

It's the first of its kind in Nellore

It's a destination of guaranteed joy, an exotic contemporary villa gated community that is brought to you by the best for the best.

**BHOOMI PUJA &**
**RELEASING OF BROUCHER**

**On Saturday, 10th November 2018**
Between 7:15 and 8:15 AM
**VPR Shantiniketan Project Site,**
Kanuparthipadu Junction, NH-16, Nellore.

**VPR BUILDERS**

Plot # 558, 5th Cross, Kings Court Avenue, Magunta Layout, Nellore - 524003, A.P.

**Ph: 0861 2354499 | M: +91 99858 22049 | E: vprbuildersnellore@gmail.com**


Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com